



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 172 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 15 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


## గిరిజనులు ఇబ్బందులు పడుతుంటే

# తట్టుకోలేకపోయా



**మారుమూల గిరిజన గ్రామంలో పార్టీ పతాకం ఆవిష్కరణ**

**కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**ఏజెన్సీ ప్రాంత రోడ్లను పరిశీలించిన నేతలు**

**పాడేరు నియోజకవర్గంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం**

**పాడేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పాడేరు నియోజకవర్గంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారుమూల గిరిజన గ్రామమైన ఓనూరులో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ స్థాపన నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మిగతా .. 2లో..

---

### ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికి

## రోడ్లు పూర్తి చేస్తాం

**మంత్రి నారాయణ**




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు రోడ్లు నిర్మిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఇప్పటికే 54 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. భూ యజమానులతో మాట్లాడి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విశాఖ నగరంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్‌తో కలిసి మంత్రి నారాయణ పర్యటించారు. సీతమ్మధారలోని మురికివాడను మిగతా .. 2లో..

---

### యుద్ధం వేళ..

## ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

**కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధానికి సంబంధించి భారతీయుల్లో భయాందోళనలు సృష్టించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం మోదీ అస్సాంలోని సిల్చార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన విపక్షాలపై మండిపడ్డారు. 'యుద్ధం నేపథ్యంలో దేశ పౌరులపై ప్రభావం పడకుండా ఉండేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇలాంటి కీలక సమయంలో కాంగ్రెస్ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తుందని భావించాం. కానీ, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయంలో అది మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలా భయాలు సృష్టించి.. నన్ను వేధించాలని చూస్తున్నారు' అని మోదీ విమర్శలు చేశారు. భారతదేశ అభివృద్ధిని జీర్ణించుకోలేని శక్తుల చేతుల్లో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అస్సాం ప్రజలను ఉద్దేశిస్తూ.. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుందన్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం మిగతా .. 2లో..

---

### ఏపీలో త్వరలో

## బీసీ రక్షణ చట్టం

**మంత్రి సవిత**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే ముసాయిదా సిద్ధం చేసినట్లు చెప్పారు. కులం, వృత్తి పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై విజయవాడ తాడిగడప బీసీ డైరెక్టర్ కార్యాలయంలో మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర చర్చించారు. చట్టం డ్రాఫ్ట్‌పై బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల ప్రతినిధుల మిగతా .. 2లో..

---

### గ్యాస్ సరఫరాపై మంత్రులకు

## సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పలువురు మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిని మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికి వివరించారు. ఉదయం 11.30 గంటలకు గ్యాస్ సరఫరా అంశంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ భేటీ అవుతున్నట్లు సీఎంకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా ఏం చేయాలో, ఎంత చేయాలో అంతా చేయాలని సీఎం సూచించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుని సమస్య లేకుండా ప్రయత్నం చేయాలని ఆదేశించారు. హోటళ్లు సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

---

### ఆన్‌లైన్‌లోనే గ్యాస్ బుకింగ్..

## ఓటీపీ ఉంటేనే సిలిండర్

**మంత్రి పయ్యావుల కేశవ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్యాస్ సరఫరా విషయంలో పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ మార్గాలవైపు కూడా దృష్టి సారించి ముందుకెళ్తున్నట్లు చెప్పారు. గ్యాస్ సరఫరా అంశంపై మంత్రులు పయ్యావుల, అచ్చెన్నాయుడులు అధికారులతో సమావేశం మిగతా .. 2లో..

---

### రప్పా రప్పా అనేవాళ్లని చూస్తే

## జాలేస్తోంది

**జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు**



**లావేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అధికారంలోకి రాగానే అడ్డం వచ్చిన వారిని రప్పా రప్పా నరుకుతామంటున్న వైకాపా నాయకులను చూస్తుంటే జాలేస్తోందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రప్పా రప్పా నరుకుతామంటే ఇప్పుడున్న సీట్లు కూడా రావన్నారు. 2024 ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేసేలా వైకాపా కుట్రలు పన్నిందని విమర్శించారు. "మళ్లీ జగన్‌కు అవకాశం ఇవ్వకూడదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే మేము కూటమితో పొత్తు పెట్టుకుని మిగతా .. 2లో..

---

### కళాశాల బస్సును

## ఢీకొట్టిన గూడ్సు రైలు


**23 మందికి తీవ్రగాయాలు**



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** రైల్వే లెవల్ క్రాసింగ్‌ను దాటేందుకు ప్రయత్నించిన కళాశాల బస్సును గూడ్సు రైలు ఢీకొట్టింది. తమిళనాడులోని కరూర్ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో 23 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తాంతోణి సమీపాన ఉన్న ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు విద్యార్థులతో బయలుదేరింది. శనివారం సాయంత్రం వెళ్లియణై వద్ద మిగతా .. 2లో..

---

## వార్ ఎఫెక్ట్.. పాకిస్థాన్ 'ప్రభుత్వ రంగ' వేతనాల్లో కోత



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు.. పశ్చిమాసియా పరిణామాలు తోడవ్వడంతో పాకిస్థాన్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇంధన సంక్షోభంతో సతమతమవుతోంది. దీంతో ప్రధాని షెహబాజ్ షరీఫ్.. మరిన్ని పొదుపు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వరంగ, స్వయం ప్రతిపత్తి మిగతా .. 2లో..

---



### తిరుమలలో భక్తులకు

## అదనంగా దిండు, దుప్పటి, చాప, రగ్గు

**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుమలలోని వసతిగృహాల్లో దిండు, దుప్పటి, చాప, రగ్గులను తితిదే అందుబాటులోకి తెస్తోంది. ప్రస్తుతం నందకంలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. త్వరలో వకుళ మాత, పాంచజన్యం, కౌస్తుభం వంటి మిగతా .. 2లో..

---

### ఇరాన్ యుద్ధం..

### పుతిన్ ప్రతిపాదనను

## తిరస్కరించిన ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. అమెరికా, రష్యా అధ్యక్షులు ఇటీవల ఫోన్‌లో సంభాషించుకొన్నారు. యుద్ధాన్ని ముగించడంలో భాగంగా.. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలను రష్యాకు తరలించాలని పుతిన్ ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే, దీనిని ట్రంప్ తిరస్కరించినట్లు సమాచారం. ఈ యుద్ధంలో ఇరాన్‌కు పరిమిత స్థాయిలో రష్యా సహాయం చేస్తుండవచ్చని మిగతా .. 2లో..

---

### ఉపాధి హామీ పథకాన్ని

## బలహీనపరుస్తున్నారు

**పాయకరావుపేటలో శ్రామికులతో కలిసి కరువు పని**

**కాంగ్రెస్ పరిరక్షణ యాత్రలో భాగంగా కార్యక్రమం**

**100 రోజుల ఉపాధిపై కార్మికులకు భరోసా**



**పాయకరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు ముఖ్యమైన ఆధారమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. గ్రామాల్లో పేదరికాన్ని తగ్గించి, వలసలను నిరోధించి, గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేసిన గొప్ప పథకం ఇదేనని ఆమె తెలిపారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని బలహీనపరుస్తోందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా పాయకరావుపేటలో శ్రామికులతో కలిసి ఆమె కరువు పనిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో మిగతా .. 2లో..

---

### సంప్రదాయబద్ధంగా

## నారా దేవాంశ్ ధోతీ వేడుక

**హాజరైన నందమూరి, నారా కుటుంబ సభ్యులు**




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతుల తనయుడు దేవాంశ్‌కు హైదరాబాద్‌లో ధోతీ వేడుక శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నందమూరి, నారా కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఈ కార్యక్రమం మిగతా .. 2లో..

---

### ఆ రెండు 'ఎల్పీజీ' నౌకలు

## హార్మూజ్ దాటాయి : కేంద్రం



**విశ్వం వాయిస్ న్యూస్ :** హార్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హార్మూజ్ జలసంధిని దాటాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందన్నారు. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశం.

**ఇబ్బందులు లేవు : కేంద్రం**

గృహవినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అవసరం లేకున్నా చాలామంది బుకింగ్ చేస్తున్నారని తెలిపింది. బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలని రాష్ట్రాలను మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

గిరిజనులు ఇబ్బందులు పడుతుంటే

# తట్టుకోలేకపోయా



తెలిపారు. పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో రవాణా, విద్య, వైద్యం వంటి సౌకర్యాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం అడవితల్లి బాట పథకంలో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించిన బీటీ రోడ్లను ఉప ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని అధికారులు వివరించగా, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నేతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**గిరిజనులు ఇబ్బంది పడుతుంటే తట్టుకోలేకపోయా: పవన్ కల్యాణ్**

**నందిగరువు, విశ్వం వాయిస్ న్యూస్ :** గిరిజనుల కష్టాలను చూసి రహదారుల నిర్మాణానికి ముందుకొచ్చామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అల్లూరి జిల్లా నందిగరువులో గిరిజనులతో పవన్ కల్యాణ్ మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కనీసం సమస్యలు విన్న పరిస్థితులు కూడా లేవన్నారు. సరైన రహదారి లేకుండా గిరిజనులు ఇబ్బంది పడుతుంటే చూసి తట్టుకోలేకపోయానన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా.. తనతో పంచుకోవాలని కోరారు. ప్రజల కష్టాలు తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ఉందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఓనూరులో జల జీవన్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిని పవన్ కల్యాణ్ పరిశీలించారు. అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి, అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. వారికి బ్యాగులు పంపిణీ చేశారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు.

ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికి

## రోడ్లు పూర్తి చేస్తాం

పరిశీలించారు. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని కలిపే మాస్టర్‌ప్లాన్ రోడ్లు, నేరెళ్లవలస నుంచి కొత్తవలస, బోయపాలెం, కాపులుప్పాడ రోడ్డు, భీమిలి నుంచి దొరతోట జంక్షన్‌కు వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభం నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి చేస్తామని నారాయణ అన్నారు. " సీతమ్మధార ప్రైవేట్ స్థలంలోని మురికివాడ వాసులను ఆదుకుంటాం. సుమారు 200 కుటుంబాలు ఇళ్లు, షెడ్లు వేసుకొని ఉంటున్నాయి. సీతమ్మధార ఏఎస్‌ఆర్ నగర్‌లోని మురికివాడను ఆధునికీకరిస్తాం" అని మంత్రి నారాయణ తెలిపారు.

ఏపీలో త్వరలో

## బీసీ రక్షణ చట్టం

అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ.. బీసీల మానప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టం తీసుకురాబోతున్నట్లు చెప్పారు. "కోర్టుల్లోనూ వీగిపోకుండా న్యాయనిపుణులతో చర్చించాం. దేశంలోనే తొలిసారిగా ఏపీలో చట్టం అమలు చేయబోతున్నాం. భేటీ వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించాం. బీసీలను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలన్నదే మా లక్ష్యం" అని మంత్రి సవిత తెలిపారు.

కళాశాల బస్సును

## ఢీకొట్టిన గూడ్సు రైలు

కుళత్తూర్‌లోని మానవరహిత రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో వేగంగా వచ్చిన గూడ్సు రైలు ఆ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం ధ్వంసం కావడంతో 23 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అంబులెన్సుల ద్వారా క్షతగాత్రుల్లో 21 మందిని కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి, ఇద్దరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను కరూర్ ఎంపీ జ్యోతిమణి, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తదితరులు పరామర్శించారు. దిండుక్కల్ జిల్లా కరికాళిలోని రాళ్ల క్వారీ నుంచి పులియూర్‌లోని ప్రైవేటు సిమెంట్ కర్మాగారానికి కంకర లోడును గూడ్సు రైలు తీసుకెళు ుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలోనూ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరాన్ యుద్ధం..

## పుతిన్ ప్రతిపాదనను తిరస్కరించిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నవేళ ఈ విషయం బయటకు వచ్చింది. అయితే, ఇలా రష్యా నుంచి ఇటువంటి ప్రతిపాదన రావడం ఇదే మొదటిసారి కాదని.. ఇంతకుముందు ఇలాంటి ఆఫర్‌లు వచ్చినట్లు అమెరికా ప్రతినిధి ఒకరు తెలిపారు. యురేనియం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనేది అమెరికా వైఖరి అని అన్నారు. మరోవైపు, ఇటువంటి ప్రతిపాదనను ఇరాన్ అంగీకరించే సంకేతాలు లేవని తెలుస్తోంది. యుద్ధానికి ముందు అమెరికాతో జరిగిన చర్చల సమయంలోనూ ఇరాన్ ఇటువంటి అంశాలను అంగీకరించలేదని సమాచారం.

యుద్ధం వేళ..

## ప్రజల్లో భయం పుట్టిస్తున్నారు

రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

ఆన్‌లైన్‌లోనే గ్యాస్ బుకింగ్..

## ఓటీపీ ఉంటేనే సిలిండర్

నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. "ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అందరూ సహకరించాలి. ఆందోళనతో ఎక్కువమంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేస్తున్నారు. కుటుంబ అవసరాలకు ఏమాత్రం లోటు లేకుండా చేయడానికే మా తొలి ప్రాధాన్యం. పైప్డ్ గ్యాస్ కంపెనీలతోనూ సమావేశమవుతాం. సిలిండర్ బుకింగ్ ఆన్‌లైన్‌లోనే ఉండాలని స్పష్టం చేశాం. సిలిండర్ కావాలంటే ఓటీపీ ఉంటేనే ఇస్తారు. బ్లాక్‌మార్కెటింగ్‌కు తరలిపోకుండా ఓటీపీ పద్ధతిలోనే సిలిండర్ ఇస్తారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

## రప్పా రప్పా అనేవాళ్లని చూస్తే జాలేస్తోంది

పోటీ చేశాం. మరోసారి వైకాపాకు అవకాశమిస్తే ప్రజలు ఈ రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఎర్రచందనం స్మగ్లింగ్‌లోనూ వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాత్ర ఉంది. రాష్ట్రంలో మరో 15 ఏళ్లు జనసేన, తెదేపా, భాజపా ఐక్యత కొనసాగుతుంది. కూటమి కలిసి ఉన్నంత వరకు వైకాపా ఆటలు సాగవు. కార్యకర్తలు ఎవరూ వైకాపా బెదిరింపులకు భయపడొద్దు. అధికారంలోకి వచ్చాక ఎన్నో అభివృద్ధి పనులు చేశాం.. ఇంకా చేస్తాం. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలి" అని నాగబాబు పిలుపునిచ్చారు.

## వార్ ఎఫెక్ట్.. పాకిస్థాన్ 'ప్రభుత్వ రంగ' వేతనాల్లో కోత

సంస్థల ఉద్యోగుల వేతనాల్లో 5 నుంచి 30 శాతం వరకు కోత విధించేందుకు ఆమోదం తెలిపారు. దీని ద్వారా సమకూరే నిధులను ప్రజా సంక్షేమానికే వినియోగిస్తామని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఇంధన ధరల హెచ్చుతగ్గుల ప్రభావంతో పాటు ఇటీవల ప్రకటించిన పొదుపు చర్యలను ప్రధాని షరీఫ్ శనివారం సమీక్షించినట్లు పాక్ పీఎంవో తెలిపింది. వివిధ కార్పొరేషన్లు, సంస్థల బోర్డుల్లో సభ్యులుగా ఉన్న ప్రభుత్వ ప్రతినిధులకు ఇకపై పార్టిసిపేషన్ ఫీజు చెల్లింపు ఉండదని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించింది. క్యాబినెట్ మంత్రులు, సభ్యులు, సలహాదారులు, ప్రత్యేక సహాయకుల రాబోయే రెండు నెలల వేతనాలను కూడా ప్రజాసంక్షేమం కోసం పొదుపు నిధులుగా వినియోగించనున్నట్లు స్పష్టం చేసింది. వీరి విదేశీ పర్యటనలపై విధించిన నిషేధం యథాతథంగా కొనసాగనుంది. ప్రభుత్వ వాహనాలకు కేటాయించే ఇంధనంలో 50 శాతం కోత విధించాలని, రాబోయే రెండు నెలల పాటు ఈ వాహనాల్లో 60 శాతం వాహనాల వినియోగాన్ని నిలిపివేయాలని ఇటీవల నిర్ణయం తీసుకోగా.. దీని అమలు తీరును థర్డ్ పార్టీ ఆడిట్ పర్యవేక్షిస్తుందని పీఎంవో తెలిపింది. కొత్త వాహనాలు, ఇతర ప్రభుత్వ కొనుగోళ్లపై నిషేధం కొనసాగుతుందని పేర్కొంది.

తిరుమలలో భక్తులకు

## అదనంగా దిండు, దుప్పటి, చాప, రగ్గు

అతిథిగృహాల్లో సేవలు విస్తరిస్తారు. వేసవి నేపథ్యంలో గదుల్లో అదనంగా వచ్చే పెద్దలు, చిన్నారుల కోసం వీటిని భక్తులు తీసుకుంటున్నారు. ఇందులో ఒక దుప్పటి రూ.10, రెండు దిండులు రూ.10, చాప రూ.10, రగ్గు రూ.20కు అందిస్తున్నారు. అవసరమైన భక్తులు రిసెప్షన్‌కు సమీపంలో వాటిని పొంది తగిన అద్దె చెల్లించవచ్చు.

ఉపాధి హామీ పథకాన్ని

## బలహీనపరుస్తున్నారు

మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో తగిన పనులు కల్పించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, అలాంటి కీలక పథకాన్ని బలహీనపరచడం సరైంది కాదని ఆమె అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామీణ కార్మికులకు 100 రోజుల ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించేందుకు పోరాటం కొనసాగిస్తామని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడేందుకు మరియు వారికి హక్కుగా లభించాల్సిన ఉపాధిని నిర్ధారించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆమె తెలిపారు.

సంప్రదాయబద్ధంగా

## నారా దేవాంశ్ ధోతీ వేడుక

జరిగింది. వారు దేవాంశ్‌కు నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో దేవాంశ్ ఆనందమయ జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్, బ్రాహ్మణిలకు నందమూరి బాలకృష్ణ దంపతులు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు 'ఎల్పీజీ' నౌకలు

## హర్మూజ్ దాటాయి : కేంద్రం

కోరామని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొంది. దేశంలో గ్యాస్, ఎల్పీజీ లభ్యతపై ఆందోళనలు నెలకొన్నవేళ.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం శాఖ అధికారులు మీడియా సమావేశంలో వెల్లడించారు.

రాష్ట్రాలతో మాట్లాడుతున్నాం

"వాణిజ్య సిలిండర్లను ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవు. అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్, బిహార్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో వాణిజ్య సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసే వారిపై దాడులు చేస్తున్నాం. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆసుపత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిలిండర్ బుక్ అవడం లేదని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. బుకింగ్‌కు గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల కనీస గడువు ఉంది" అని పెట్రోలియం శాఖ అధికారులు పేర్కొన్నారు.

నౌకా సిబ్బంది సురక్షితమే..

గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయని, వాటిలో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపింది. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని వెల్లడించింది.

# గ్యాస్ కొరత... కూటమి సర్కార్ క్లారిటీ



ఇదిలా ఉంటే ఏపీలో మొత్తం ఎల్పీజీ కనెక్షన్ల సంఖ్య 161.19 లక్షలుగా ఉందని ప్రభుత్వం పేర్కొంది. ఇందులో ఐవోసీఎల్ 56.86 లక్షలుగా ఉన్నాయి. హెచ్ పీసీఎల్ కనెక్షన్లు 74.11 లక్షలు, బీపీసీఎల్ 30.22 లక్షలు ఉన్నాయి. ఏపీలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని సరఫరాలోనూ ఏ విధమైన ఇబ్బంది లేదని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఏపీలో అందరికీ సకాలంలో గ్యాస్ సరఫరా జరుగుతుందని చెబుతోంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎప్పటికప్పుడు పరిస్థితిని పూర్తిగా మానిటరింగ్ చేస్తున్నామని చెబుతోంది.

**ఎల్పీజీ కనెక్షన్ల తాజా పరిస్థితి :** ఇదిలా ఉంటే ఏపీలో మొత్తం ఎల్పీజీ కనెక్షన్ల సంఖ్య 161.19 లక్షలుగా ఉందని ప్రభుత్వం పేర్కొంది. ఇందులో ఐవోసీఎల్ 56.86 లక్షలుగా ఉన్నాయి. హెచ్ పీసీఎల్ కనెక్షన్లు 74.11 లక్షలు, బీపీసీఎల్ 30.22 లక్షలు ఉన్నాయి. అలాగే రోజువారీ ఎల్పీజీ అవసరం కోసం 4 వేల మెట్రిక్ టన్నులు కావాల్సి ఉందని పేర్కొంది. ఇక ఈ నెల 12 నాటికి మొత్తం ఎల్పీజీ స్టాక్ లభ్యత 15,880 మెట్రిక్ టన్నులుగా ఉందని పేర్కొంది. ఇది 3.92 రోజులకు సరిపోతుందని పేర్కొంది.

**పూర్తి నియంత్రణలో :** ఇక చూస్తే కనుక ప్రస్తుతం రాష్ట్రంలో గ్యాస్ అందుబాటు సరఫరా పరిస్థితి నియంత్రణలోనే ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే సోషల్ మీడియాల్లో వినియోగదారులను తప్పుదారి పట్టించేవారు అలాగే, నిరాధారమైన ప్రచారం చేస్తున్న వారు ఉన్నారని అధికారులు విమర్శిస్తున్నారు. తగినంత ఇంధనం దేశవ్యాప్తంగా అందుబాటులో లేదన్న వదంతులు వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియా పుకార్ల కారణంగా దేశీయ రీఫిల్ బుకింగ్స్ ఒక్కసారిగా 15 శాతం మేర పెరిగిందని గుర్తు చేశారు. ఇక దుర్వినియోగం నిరోధించడానికి ఓటీపీ ఆధారిత డెలివరీతో అందిస్తున్నామని చెప్పారు.

**నిరంతర పర్యవేక్షణలో :** ఇక పెండింగ్ బుకింగుల పర్యవేక్షణ డిస్ట్రిబ్యూటర్ వారీగా, మార్కెట్ వారీగా జిల్లాల వారీగా సేల్స్ ఏరియా వారీగా ప్రాంతం వారీగా ఉందని అధికారులు చెబుతున్నారు. గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి పరిశ్రమలకు బల్క్ ఎల్పీజీ సరఫరా నిలిచిందని చెప్పారు అదే విధంగా ముఖ్యమైన విభాగాలుగా తీసుకుని ఆసుపత్రులు, హాస్టల్స్, ప్రభుత్వ సేవలఅకు వాణిజ్య సరఫరా కోసం ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని చెప్పారు.

**ఆర్టీజీఎస్‌లో కంట్రోల్ రూమ్ :** ఇక ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రెవెన్యూ,పౌర సరఫరాలు, పోలీసు, ఓఎంసీ ప్రతినిధుల సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని అధికారులు వెల్లడిస్తున్నారు. అలాగే సోషల్ మీడియా పర్యవేక్షణ సెల్ ని కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. సోషల్ మీడియాను పర్యవేక్షించడానికి అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా వాస్తవాన్ని తెలియజేయడానికి ఎప్పటి కప్పుడు పత్రికా ప్రకటనలు జారీ జరుగుతోందని అధికారులు వివరించారు.

బొత్స రాజకీయ విశ్రాంతి..

# ఇక హైదరాబాద్‌కే పరిమితమా?

మండలిలో విపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ రాజకీయంగా పూర్తి విశ్రాంతి తీసుకునే ఆలోచనలో ఉన్నారా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది.మండలిలో విపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ రాజకీయంగా పూర్తి విశ్రాంతి తీసుకునే ఆలోచనలో ఉన్నారా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఇటీవల అస్వస్థతకు గురైన బొత్స ప్రస్తుతం హైదరాబాద్ లో విశ్రాంతి తీసుకుంటున్నారు. పార్టీలో ఇతర నేతలు ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం నుంచి రాజకీయంగా ఆయనపై పెద్దగా ఒత్తిడి లేకపోయినా, ఆరోగ్యం మాత్రం గతం మాదిరిగా సహకరించడం లేదని చెబుతున్నారు. దీంతో రాజకీయ కార్యక్రమాలు క్రమంగా తగ్గించుకోవాలనే ఆలోచనతో ఆయన ఉన్నారని అంటున్నారు. ఈ కారణంగానే హైదరాబాద్ కు మకాం మార్చారని అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత బొత్స ఎక్కువగా విశాఖలోనే ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలు, మండలి సమావేశాలు ఉన్నప్పుడు విజయవాడకు వస్తుంటారు. సొంత ఊరు విజయనగరం, సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని ఆలోచనతో హైదరాబాద్ కు మకాం మార్చారని అంటున్నారు. ఆయన ఎదుర్కొంటున్న ఒత్తిడి వల్ల కుటుంబ సభ్యులు కూడా కొన్ని రోజులు రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకోవాలని పట్టుబడుతున్నారని అంటున్నారు. అయితే బొత్స ప్రస్తుతం తీసుకుంటున్న రాజకీయ విశ్రాంతి తాత్కాలికమా? కాదా? అన్నది సస్పెన్స్ గా మారిందని అంటున్నారు. మండలిలో విపక్ష నేతగా బొత్స ప్రస్తుతం కేబినెట్ హోదాలో ఉన్నారు. వచ్చే ఏడాది వరకు ఆయనకు ఈ పదవి ఉంటుందని చెబుతున్నారు. అప్పటివరకు క్రియాశీలంగా ఉండాలని, ఆ తర్వాత నెమ్మదిగా ప్రత్యక్ష రాజకీయాల నుంచి దూరం జరగాలని కుటుంబ సభ్యులు బొత్సను కోరుతున్నట్లు చెబుతున్నారు. ఎలాగూ వారసులు అందుబాటులోకి వచ్చినందున రాజకీయాల నుంచి తప్పుకొని కొద్దికాలం విశ్రాంతి



తీసుకుని ఆరోగ్యం మెరుగుపరచుకోవాలని సూచిస్తున్నారని చెబుతున్నారు. బొత్సకు గతంలో బైపాస్ జరిగిందని గుర్తు చేస్తున్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఆయన రక్తపోటు సమస్యలను ఎక్కువగా అనుభవిస్తున్నారు. విశ్రాంతి లేకుండా గడపడం వల్లే బొత్స అనారోగ్యం పాలవుతున్నారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర రాజకీయాలతోపాటు పార్టీ వ్యవహారాలలో తీరిక లేకుండా గడపడం వల్ల బొత్సపై ఎక్కువ ఒత్తిడి పెరుగుతోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోవాలని ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. ఇటీవల తనను కలవడానికి వచ్చిన సొంత నియోజకవర్గం నేతలతోనూ ఈ ఆలోచనను బొత్స పంచుకున్నారని, వచ్చే స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని హితవు పలికారని అంటున్నారు. దీంతో సమీప భవిష్యత్తులో ఆయన జిల్లాకు వచ్చే ఆలోచన లేదని, వచ్చినా రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. తప్పనిసరి పార్టీ పనులకు మాత్రమే పరిమితం కావాలని ఆలోచనకు వచ్చిన బొత్స క్షేత్రస్థాయి రాజకీయ యుద్ధానికి దూరంగా జరగాలని దాదాపు నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.

# ఎడిటర్ వాయిస్

## విజయ్‌కి భారీ ఆఫర్.. కీలకంగా పవన్?

తమిళనాడు రాజకీయాల్లో జనసేన అధినేత ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలకం కాబోతున్నారా అంటే ప్రచారం చూస్తే కనుక అవును అనే జవాబు వస్తోంది. పవన్ కళ్యాణ్ ఎన్డీయేలో ముఖ్య భాగస్వామిగా ఉన్నారు. ఆయన మీద కేంద్ర బీజేపీ పెద్దలకు ఎంతో నమ్మకం ఉంది. ఇక తమిళనాడులో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించి తీరాలని కమల నాధులు గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో తమకు అంది వచ్చిన ప్రతీ అవకాశాన్ని విడిచిపెట్టకూడదని భావిస్తున్నారు. అలాగే గెలుపునకు అవసరమైన కొత్త వ్యూహాలను సైతం అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో అసాధ్యాలను సుసాధ్యం చేసేందుకు కూడా రెడీ అవుతున్నారు.

**ద్విముఖ పోటీగా :** పవన్ సౌత్ ఇండియా మొత్తం తెలిసిన తెలుగు సూపర్ స్టార్. పవన్ కి తమిళ సూపర్ స్టార్లతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇపుడు దానినే ఆసరాగా చేసుకుని బీజేపీ పెద్దలు అటు వైపు నుంచి కూడా నరుక్కు రావాలని చూస్తున్నారుట. విజయ్ తమిళ సూపర్ స్టార్. ఆయన టీవీకే పార్టీ పెట్టారు. ఏ సర్వే చూసినా విజయ్ పార్టీకి డబుల్ డిజిట్ ఓటు షేర్ లభిస్తుందని కచ్చితంగా చెప్పేస్తున్నాయి. విజయ్ ప్రభావం ఈసారి తమిళనాడు ఎన్నికల మీద గణనీయంగా ఉంటుందని కూడా పేర్కొంటున్నాయి. దాంతో విజయ్ కనుక ఒంటరిగా పోటీ చేస్తే ఈ ఓట్లు చీలి ప్రతిపక్షంలోని అన్నా డీఎంకే బీజేపీ కాంబోకే దెబ్బ పడి అధికార డీఎంకేకు ఎంతో మేలు జరుగుతుంది అని అంటున్నారు. దాంతో ఇపుడు విజయ్ పార్టీని తమ వైపునకు తిప్పుకోవడం ద్వారా త్రిముఖ పోటీని ద్విముఖ పోటీగా మార్చాలని బీజేపీ చూస్తోంది అని అంటున్నారు.

**పవన్ చేతిలోనే :** అందుకోసం పవన్ కళ్యాణ్‌ని ఉపయోగించుకుంటున్నారు అని వార్తలు వస్తున్నాయి. విజయ్ తో నేరుగా సంప్రదించేందుకు ఎన్డీయేకు ఈ స్థాయిలో నేతలు ఎవరూ లేరని అంటున్నారు. పైగా ఇదంతా ఒక స్మూత్ డీలింగ్ గా సాగాలి అంటే ఏపీకి చెందిన పవన్ కళ్యాణ్ బెస్ట్ అనుకుని ఆయనను రంగంలోకి దింపుతున్నారు అని అంటున్నారు. విజయ్ తో ఉన్న పరిచయాన్ని సినీ సంబంధాలను ఉపయోగించుకుని పవన్ ద్వారా చెప్పించి ఒప్పించాలని బీజేపీ కేంద్ర పెద్దలు చూస్తున్నారు అని అంటున్నారు. ఇక పవన్ సైతం కేంద్ర పెద్దల ఆలోచనలను తగినట్లుగా మధ్య వర్తిగా ఈ వ్యవహారంలో ఉంటున్నారు అని కూడా ప్రచారం సాగుతోంది.

**చికాకుల్లో దళపతి :** ఇక విజయ్ టీవీకే పార్టీ పెట్టినప్పటి నుంచి చిక్కులను ఎన్నో ఎదుర్కొంటున్నారు. అది ఆయన వ్యక్తిగత జీవితం కావచ్చు, లేదా రాజకీయంగా సభలు పెడితే తొక్కిసలాట జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన వ్యవహారమే కావచ్చు ఇతర సమస్యలు కావచ్చు జనంలో ఊపు ఉన్నా సొంత సమస్యలే ఎక్కువగా ఏర్పడుతున్నాయని అంటున్నారు. ఒక వైపు సినిమా రిలీజ్ కాకుండా ఇబ్బందులు, మరో వైపు తొక్కిసలాట కేసులో విచారణలు ఇలా టీవీకే సతమతమవుతున్న వేళ విజయ్ సైతం సరికొత్త రాజకీయ వ్యూహాల మీద ఫోకస్ పెడుతున్నట్లుగా చెబుతున్నారు.

**అదిరిపోయే ఆఫర్ రెడీ :** ఈ క్రమంలో విజయ్‌కి అదిరిపోయే ఆఫర్‌ని ఎన్డీయే పెద్దలు ఇస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఈ ఆఫర్ ఏమిటి అంటే ఎన్ డీయేలో విజయ్ పార్టీ టీవీకే చేరితే కనుక ఆ పార్టీ అధికారంలోకి వస్తే చెరి రెండున్నరేళ్ళ పాటు ముఖ్యమంత్రి పదవిని టీవీకేతో కలసి పంచుకునే ప్రతిపాదన అన్న మాట. ఇది అద్భుతమైన ప్రతిపాదనగా చెబుతున్నారు. రేపటి ఎన్నికల్లో తమిళనాడులో ఎన్డీయే గెలిస్తే అన్నా డీఎంకే నుంచి మాజీ సీఎం పళనిస్వామి ఒక రెండున్నరేళ్ల పాటు, అలాగే విజయ్ మరో రెండున్నరేళ్ళ పాటు సీఎం గా ఉంటారు అన్నది బీజేపీ కేంద్ర పెద్దలు టీవీకేకి ఇస్తున్న భారీ ఆఫర్ అని అంటున్నారు. ఈ ఆఫర్ తో పవన్ కళ్యాణ్ ద్వారా విజయ్‌కి కీలక సందేశాన్ని పంపించారు అని అంటున్నారు.

**కలిస్తే బంపర్ హిట్ :** ఇక విజయ్ పార్టీ కనుక ఎన్డీయేలో చేరితే ఈ కాంబో సూపర్ హిట్ అవుతుందని అంతా అంచనా వేస్తున్నారు. అదెలా అంటే విజయ్ పార్టీకి యూత్ లో బ్రహ్మాండమైన ఆదరణ ఉంది అంటున్నారు. అలాగే పళనిస్వామికి అన్నా డీఎంకేకి గ్రామీణ ప్రాంతంలో మంచి పట్టు ఓటు బ్యాంక్ ఉంది. ఇక బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఇలా ఈ బలాలు అన్నీ కలిస్తే కనుక అధికార డీఎంకేని ఓడించి మరీ తొలిసారి ఎన్డీయే తమిళనాడులో గద్దెనెక్కడం ఖాయమన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇక ఈ ప్రతిపాదనకు పళనిస్వామి మొదట ఆలోచించినా బీజేపీ కేంద్ర పెద్దల సూచనలతో అంగీకరించారు అని ప్రచారం సాగుతోంది. ఇక విజయ్ పార్టీ విషయం తేలాల్సి ఉందని అంటున్నారు. ఒంటరిగా పోటీ చేసినా కొన్ని సీట్లు గెలుచుకోవడం తప్ప అధికారం దక్కదని సర్వేలు చెబుతున్న నేపథ్యంలో తొలి ఎన్నికల్లోనే సీఎం అయ్యే చాన్స్ ఈ ఆఫర్ ద్వారా రావడం టీవీకేని కూడా ఆలోచింపచేస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ ప్రచారంలో ఎంత నిజం ఉందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## హృదయ విదారకం.. వృద్ధురాలి మరణం

### చేతిని పీక్కుతిన్న పిల్లులు



**మందమర్రి పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** హృదయ విదారక స్థితిలో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో చనిపోయిన ఆమె చేతిని పెంపుడు పిల్లులు పీక్కుతిన్నాయి. మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన జక్కనబోయిన లక్ష్మి (80) తన రెండో కుమారుడు సమేందర్ వద్ద ఉంటున్నారు. గురువారం అతను పని నిమిత్తం బెల్లంపల్లికి వెళ్లగా లక్ష్మి ఒంటరిగా ఇంట్లో ఉండిపోయారు. ఈ క్రమంలో ఆమె గడప తగిలి కింద పడిపోగా తలకు గాయమై అచేతన స్థితికి చేరుకున్నారు. ఇంట్లో లైట్లు వెలగకపోవడం.. అలికిడి లేకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంట్లోకి వెళ్లిచూడగా కదల్లేని స్థితిలో ఆమె ఉండడం చూసి కుమారులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి ఆమె చనిపోయి ఉన్నారు. ఇంట్లో ఉన్న రెండు పెంపుడు పిల్లులు ఆమె చేతిని చాలావరకు పీక్కుతినడం స్థానికులను కలచివేసింది. సీఐ పర్స రమేష్, ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అతివేగం ఆయువు తీసింది

### బస్సు బోల్తా.. నలుగురి దుర్మరణం



**ఇందల్‌వాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** అతివేగం నాలుగు నిండు ప్రాణాలను బలిగొంది. నిజామాబాద్ జిల్లాలో బస్సు బోల్తాపడిన దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని అకోలాకు 23 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేటు బస్సు గురువారం రాత్రి 11 గంటలకు బయల్దేరింది. అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం గన్నారం సమీపంలో మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఓ బండ రాయిని ఢీకొని వెళ్లి 50 మీటర్ల దూరంలో బోల్తా పడింది. మహారాష్ట్రలోని వాసిమ్ జిల్లాకేంద్రానికి చెందిన లక్ష్మణ్ భార్యా పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని పప్పు పరిశ్రమలో పనిచేస్తున్నారు. బస్సు ప్రమాదంలో ఆయన భార్య మంజూష (30), కుమారుడు రిషి (7) చనిపోయారు. హైదరాబాద్ నుంచి ఇంటికి వెళ్తుండగా భార్య, కుమారుడిని కోల్పోయానంటూ లక్ష్మణ్ విలపించిన తీరు అక్కడున్నవారిని కలచివేసింది.

#### పెళ్లయిన ఆరు నెలలకే..!

హైదరాబాద్‌లో ఉంటూ గడియారాల వ్యాపారం చేస్తున్న బెంగళూరుకు చెందిన అబ్బాస్ (30) నాందేడ్‌కు వెళుతూ ఈ ప్రమాదంలో మరణించారు. అతనికి ఆరు నెలల క్రితమే వివాహం జరిగిందని బంధువులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగ్‌పుర్‌కు చెందిన రెండో డ్రైవర్ రాహుల్ (30) నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సులో 60 చిలుకలను అధికారులు గుర్తించారు. వాటిలో కొన్ని మృతిచెందగా.. మిగిలినవాటిని వదిలిపెట్టారు.

## బావిలో క్రేన్ పడి.. ముగ్గురి మృతి

**భూపాలపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** బావిలో క్రేన్ పడిపోయి.. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామంలో చోటు చేసుకుంది. వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా.. ప్రమాదవశాత్తు వైరు తెగి క్రేన్ బావిలో పడిపోయింది. దీంతో కొరికిశాలకు చెందిన దేవారావు, అభిలాష్, పిడిసిల్ల వాసి పైడయ్య అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైకు.. ముగ్గురి మృతి

**కొల్చారం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను హవేలీఘనపూర్ మండలం బొడుగ భూపతిపూర్ గ్రామానికి చెందిన అమృత్ గౌడ్ (40), ఆయన కుమారుడు రిషి వర్ధన్ గౌడ్ (12), బావమరిది సాయి గౌడ్ (35)గా గుర్తించారు. రంగంపేట గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## షేక్‌పేట్‌లో అగ్నిప్రమాదం



**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని షేక్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కుతుబ్ షాహీ టూంబ్స్ సమీపంలోని సబ్‌స్టేషన్ పక్కన నిలువ చేసిన పాత టైర్లకు మంటలు అంటుకున్నాయి. ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలకూ మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు టైర్లకు మంటలు అంటించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## మంత్రాలయం బస్సులో భారీ చోరీ

### రూ.90 లక్షల ఆభరణాలతో పరారీ
### సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దుండగుల ఆనవాళ్లు



**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలోని మంత్రాలయం నుంచి కర్ణాటకలోని మంగళూరుకు వెళుతున్న స్లీపర్ కోచ్‌లో ప్రయాణిస్తున్న మహ్మద్, ఇర్షాద్ అనే ఆభరణాల వ్యాపారుల నుంచి నిందితులు గురువారం అర్ధరాత్రి రూ.90 లక్షల విలువైన నగలు చేజిక్కించుకుని పరారయ్యారు. కొప్పళ శివార్లలోని తవా పంజాబ్ హోటల్ వద్ద బస్సును భోజనానికి ఆపినప్పుడు వ్యాపారుల వద్ద ఉన్న నగల సంచితో నిందితులు పరారయ్యారు. ఈ వ్యాపారులు ఇద్దరూ మొదట సింధనూరులో ఒక ఆభరణాల దుకాణంలో కొన్ని నగలు ఇచ్చారు. అక్కడి నుంచి బస్టాండ్‌కు వచ్చి మంగళూరుకు ఏ బస్సులో వెళ్లాలో చర్చించుకున్నారు. ఒక నిందితుడు వారితో బస్సు ఎక్కగా, మరో ముగ్గురు కారులో అనుసరిస్తూ వచ్చారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కొప్పళ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కొప్పళ సమీపాన బస్సు ఆగినప్పుడు దుండగులు పరుగులు తీయడం అక్కడి సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది.

#### పెళ్లికి నిరాకరించిందని..

## యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఎక్కించి

**ఘట్‌కేసర్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని పోచారం ఐటీకారిడార్ పీఎస్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందని యువతికి ఓ యువకుడు హెచ్ఐవీ ఉన్న రక్తాన్ని ఎక్కించాడు. నిందితుడు మనోహర్‌తో బాధిత యువతికి గతంలో వివాహం నిశ్చయమైంది. అయితే.. అతడికి హెచ్ఐవీ ఉందని తెలియడంతో ఆమె పెళ్లికి నిరాకరించింది. ఈ క్రమంలోనే ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లి అతడు.. పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో హెచ్ఐవీ ఇంజెక్షన్ ఎక్కించి పారిపోయాడు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు.

## పిల్లల గొంతునులిమి.. తల్లి ఆత్మహత్య

**రహ్మత్‌నగం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. ఓ మహిళ తన ఇద్దరు పిల్లల గొంతు నులిమి, తాను ఉరేసుకుంది. ఈ ఘటనలో ఆమెతోపాటు కుమారుడు మృతి చెందగా.. కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ కలహాలతో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పెద్దమ్మనగర్‌కు చెందిన సత్యవాణి, మురళి వేణు దంపతులకు కుమారుడు (5), కుమార్తె (2) ఉన్నారు. మురళి వేణు తన తండ్రిని డయాలసిస్ చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. ఆ సమయంలో సత్యవాణి తన ఇద్దరు పిల్లల గొంతు నులిమి, తాను ఉరేసుకుంది. బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సక్సెస్ వాయిస్

### 11 ఏళ్ల వయసులోనే ఇన్ఫెక్షన్..

## అదే ఆమెను పారిశ్రామికవేత్తగా మార్చింది..

లుంబినీ ప్రావిన్స్‌లోని తిలోత్తమ మునిసిపాలిటీ-1కి చెందిన అంజు థాపాకు 11 ఏళ్ల వయసులో మొదటి పీరియడ్ వచ్చింది. స్థానిక సంప్రదాయం ప్రకారం ఆమె తొమ్మిది రోజుల పాటు గోశాలలో విడిగా నివసించవలసి వచ్చింది. రక్తస్రావం అడ్డుకోవడానికి గుడ్డలను ఉపయోగించారు. మురికి గుడ్డ ముక్కలను పదే పదే ఉపయోగించడం వల్ల ఆమెకు ఇన్ఫెక్షన్ సోకింది. అప్పుడే అంజు థాపాకు ప్యాడ్స్ తయారు చేయాలని ఆలోచన వచ్చింది. చిన్నతనంలో ఏం చేయలేకపోయింది. కానీ పెళ్లైన తర్వాత భర్త సాయంతో అనుకున్నది చేసి పారిశ్రామికవేత్తగా మారింది. " పెళ్లైన తర్వాత నేను స్థానిక మార్కెట్?లో లభించే అన్ని రకాల శానిటరీ ప్యాడ్?లను ప్రయత్నించాను. కానీ అవి సరిగా లేవు" అని థాపా పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఉద్యోగం చేస్తున్న భర్త ప్రకాష్?తో థాపా తన సమస్యను పంచుకుంది. అతను ఆమెకు అక్కడ నుంటు పునర్వినియోగపరచదగిన శానిటరీ ప్యాడ్‌ల పంపించాడు. అవి స్థానిక మార్కెట్లో లభించే వాటి కంటే మెరుగ్గా ఉన్నాయని అంజు థాపా చెప్పారు. ఎటువంటి అలెర్జీ రాలేదన్నారు. థాపా గర్భం దాల్చడంతో బ్యాంకు ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వచ్చింది. దీంతో ఇంట్లో ఉంటూ తను అనుకున్న వ్యాపారాన్ని ప్రారంభించాడనికి కసరత్తు మొదలు పెట్టింది. ట్యుటోరియల్స్ విని ప్యాడ్‌లను తయారు చేయడం నేర్చుకుంది. మొదట్లో స్థానికంగా లభించే మెటీరియల్స్ తో ప్యాడ్స్ తయారు చేసింది. ఆమె రెండు సంవత్సరాల ప్రయత్నంలో ప్యాడ్స్ తయారీలో నైపుణ్యం సాధించింది. 2019లో ఆమె శానిటరీ ప్యాడ్‌లను తయారు చేయడానికి తన సొంత ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. ఆమె రూ.2.5 మిలియన్లు వెచ్చించి ఏడు యంత్రాలను కొనుగోలు చేసింది. చైనా, బంగ్లాదేశ్ నుంచి ముడి పదార్థాలను కొనుగోలు చేసింది. థాపా తన ఫ్యాక్టరీలో నలుగురు మహిళలు పనిచేస్తున్నారు. ఆమె భర్త ప్రకాష్ తన వ్యాపారాన్ని విస్తరించడంలో సహాయం చేయడానికి సౌదీ అరేబియా నుంచి తిరిగి వచ్చాడు. ప్రకాష్ ఉత్పత్తిని విక్రయించడానికి డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నాడు. పునర్వినియోగ ప్యాడ్స్‌కు డిమాండ్ క్రమంగా పెరుగుతోందన్నాడు. యూజ్ అండ్ త్రో శానిటరీ ప్యాడ్‌ల వల్ల కలిగే కాలుష్యంపై అవగాహన పెరగడం కూడా పునర్వినియోగ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడానికి కారణమని భార్యాభర్తల చెబుతున్నారు. థాపా ఉత్పత్తులు ఇప్పుడు దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్నాయి. వివిధ స్థానిక సంస్థలు, ఆరోగ్య సంస్థలు, మహిళా సంఘాల అభ్యర్థన మేరకు పునర్వినియోగ ప్యాడ్‌లను తయారు చేయడంలో మహిళలకు నేర్పించడానికి ఆమె వివిధ జిల్లాలకు కూడా వెళ్తున్నారు. అంజు థాపా విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తగా ఎదిగారు.

### ఇడ్లీ, దోశ పిండి అమ్మి


## రూ.2000 కోట్లకు అధిపతిగా మారాడు..




అతని తండ్రి రోజుకు రూ.10 సంపాదించేవాడు. కానీ అతను మాత్రం రూ. 2,000 కోట్ల విలువైన సామ్రాజ్యానికి అధిపతిగా మారాడు. అతనే ముస్తఫా పీసీ. కఠిక పేదరికం నుంచి వచ్చి వేల కోట్లు సంపాదించిన ముస్తఫా పీసీ జీవితం అందరికి ఆదర్శం. "నా తండ్రి రోజుకు 10 రూపాయలు సంపాదించాడు" అని అతను ది నియాన్ షో పాడ్‌కాస్ట్ హోస్ట్ సిద్ధార్థ అహ్లువాలియాతో చెప్పాడు. ముస్తఫా పీసీ పదేళ్ల వయసులో అతను తన తండ్రికి పొలంలో కట్టెలు సేకరించడం సహాయం చేయడంతో తన పనిని ప్రారంభించాడు. ఆ తర్వాత చదువుపై దృష్టి పెట్టాడు. కష్టపడి చదివి నేషనల్ ఇన్?స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాలికట్ నుండి కంప్యూటర్ సైన్స్?లో పట్టా పొందారు. తర్వాత ఎలక్ట్రానిక్ వస్తువుల దిగ్గజం మోటరోలాతో కొన్నాళ్లు పనిచేశాడు. అతని డిగ్రీ తర్వాత అతను దుబాయ్‌లోని సిటీ బ్యాంక్‌లో ఉద్యోగం చేశాడు. కొన్ని సంవత్సరాల తర్వాత ముస్తఫా ఇండియాకు వచ్చాడు. అంతేకాదు బెంగళూరులోని ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ పూర్తి చేశాడు. బెంగళూరు ఐఐఎంలో చదువుతున్నప్పుడు ముస్తఫా తన బంధువులతో కలిసి దోసె, ఇడ్లీ పిండి తయారీ కంపెనీని ప్రారంభించాడు. ఐడీ ఫ్రెష్ అనే కంపెనీ 2005లో రూ. 50,000 సీడ్ క్యాపిటల్?తో ప్రారంభించాడు. మొదట్ల వారి బిజినెస్ చాలా నెమ్మదిగా సాగింది. అయినా వారి ప్రయత్నం మాత్రం ఆపలేదు. ప్రారంభంలో వారి కంపెనీ రోజుకు కేవలం 10 ప్యాకెట్ల పిండిని విక్రయించేది. కానీ క్రమంగా వారి బిజినెస్ పెరిగింది. వారి బిజినెస్ 10 ప్యాకెట్ల నుంచి 10 వేల ప్యాకెట్లకు చేరుకుంది. నేడు కంపెనీ రూ. 479 కోట్ల వార్షిక లాభంతో హోమ్ మేడ్ ఫుడ్ ఐటమ్ దిగ్గజంగా ఎదిగింది. ముస్తఫా సరసమైన ధరకు తాజాగా ఇంట్లో తయారు చేసిన ఒ వండడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల అమ్ముతున్నారు. ఐడీ ఫ్రెష్ దేశంలో ప్రముఖ బ్రాండ్ గా ఎదిగింది. తన కంపెనీతో పాటు ముస్తఫా పీసీ కూడా వ్యాపారవేత్తగా ఎదిగారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 15 మార్చి 2026

www.viswamvoice.com




# కష్టాలను తట్టుకుని నిలబడ్డ వ్యక్తి పవన్ కళ్యాణ్

**పవన్ ఆశయ సాధనలో రాజానగరం నియోజకవర్గం అడ్డగా ఉంది- జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో భారీ బైక్ ర్యాలీ**

**ర్యాలీనీ జెండాతో ప్రారంభించిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**







**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాజానగరం నియోజవర్గం దివాన్ చెరువు గ్రామం నుండి కోరుకొండ వరకు భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేసి ఈర్యాలీనీ రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల మీడియాతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ఏర్పాటు చేసిన పార్టీ జనసేన పార్టీ, రాజానగరం నియోజకవర్గ జనసేన అడ్డాగా మార్చడం జరిగింది,12 సంవత్సరాల పూర్తయి 13వ సంవత్సరంలో అడుగుపెట్టిన శుభతరుణంలో బైక్ ర్యాలీ పెట్టి పవన్ కళ్యాణ్ కు సంఘీభావం తెలియజేస్తున్నాము. భారతదేశ చరిత్రలో జనసేన లాంటి పార్టీ పుట్టదు పుట్టలేదు పుట్టబోదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ పెట్టడం జరిగింది, ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు వచ్చినా తట్టుకుని నిలబడ్డ వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు.

**బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో**

# రాజమండ్రిలో ఉమెన్స్ ఫెస్ట్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముక్తికి మార్గం చూపే దివ్య గ్రంథం బైబిల్ అని, ప్రపంచంలో ఎక్కువమంది చదివే పుస్తకమని బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు రెవరెండ్ డాక్టర్ లీలావతి వేమూరి అన్నారు.రాజమండ్రిలోని జవహర్ లాల్ నెహ్రూ రోడ్ లో ఉన్న చర్చ్ ఆఫ్ షాలోమ్ లో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని "ఉమెన్స్ ఫెస్ట్ - 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మహిళలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ ప్రతాప్ సిన్హా కొమానపల్లి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లీలావతి వేమూరి సుదీర్ఘ ప్రసంగాన్ని అందించారు. బైబిల్ గ్రంథంలో ఉన్న గొప్ప మహిళలను గురించి వివరించారు. కుటుంబంలో భర్త యజమానిగా ఉన్నప్పటికీ భార్య భక్తి విషయంలో ముందుండాలని, ఎక్కువగా ప్రార్థనలో గడిపి కుటుంబ సభ్యుల కొరకు ప్రార్థించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.అందులో భాగంగా రాజమండ్రిలో వుమెన్ ఫెస్ట్- 2026 తలపెట్టమన్నారు. బైబిల్ లేని వారికి అతి తక్కువ ధరలో బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా అందిస్తున్నామని పేర్కొన్నారు.మరికొన్ని చోట్ల ఉచితంగా బైబిల్ ను పంపిణీ చేస్తున్నామని ఆమె తెలిపారు. ముఖ్య వర్తమానాన్ని రెవరెండ్ ప్రెస్కిల్లా విజయకుమార్ అందించారు.షారోన్ సిస్టర్,డాక్టర్ సునీత దెబోరా,రెవరెండ్ డాక్టర్ లత సుధీర్ కుమార్ సంగీతాన్ని సమాకూర్చారు.ఈ కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ కే సుధీర్ కుమార్, రెవరెండ్ డాక్టర్ కే.జాన్ విక్రమ్, రెవరెండ్ పి. శామ్యూల్, బ్రదర్ ఎన్. జయ ప్రకాష్, రెవరెండ్ డాక్టర్ మార్టిన్ గుళ్ల,రెవరెండ్ బీ.టాటా విక్టర్, డాక్టర్ మోజస్ బాబు, బ్రదర్ రెవరెండ్ రక్షగానందం,బిషప్ రాజు బత్తిన, రెవరెండ్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల పట్ల కూటమి ప్రభుత్వం వివక్షత పాటిస్తుంది

**- ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి మాదిగల హత్యాకాండ నిందితులను శిక్షించాలి - బాధితులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి**

**- వచ్చే 15 రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే అమరావతిలో పెద్ద ఎత్తున ఉద్యమం - మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు, ఉందుర్తి సుబ్బారావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మూల కారణమైన మాదిగల పట్ల కూటమి ప్రభుత్వం వివక్షత పాటిస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 నెలల్లో రాయలసీమ , ఇతర జిల్లాల్లో 15 మంది కుమారు 15 మంది మాదిగ సామాజిక వర్గాల క్రూరంగా హత్యలు, అత్యాచార సంఘటనలు జరిగినప్పటికీ నిందితులపై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోక పోవడం దారుణం అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన సందర్భంగా శనివారం ఆయన స్థానికంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాయలసీమ జిల్లాల్లో ని కర్నూలు, నెల్లూరు జిల్లాలో కొందరు దుండగులు ట్రాక్టర్ల తో ఢీ కొట్టి కత్తులు, ఇనప రాడ్లతో దాడులు చేసి పాశవికంగా మాదిగ కుల వ్యక్తులను చంపి వేసిన నిందితులపై 43 రోజుల గడిచినప్పటికీ చర్యలు లేవన్నారు. దారుణ హత్యాకాండ కు గురైన వారిలో చిప్పగిరి లక్ష్మీనారాయణ, జానకి ,గోవిందమ్మ, సతీష 13 మంది మాదిగ వర్గీయులు బలయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి ఐదు నెలల్లో కఠినంగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబానికొక ఉద్యోగం ఇవ్వాలని, భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వానికి కుడి భుజం గా ఉన్న ఎంఆర్పిఎస్ నాయకుడు కృష్ణ మాదిగ ఒకటి రెండు బాధిత కుటుంబాలను పరామర్శించి మామ అనిపించడం శోచనీయమన్నారు ఇదే డిమాండ్ తో గత 45 రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కాకినాడలో మాదిగ సామాజిక, ప్రజాసంఘాలతో మాదిగల ఆత్మగౌరవ గర్జన సభలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం 15 రోజుల్లో స్పందించాలని, లేనియెడల అమరావతిలో రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సామాజిక వర్గాలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ, గత 20 నెలల్లో రాష్ట్రంలో సుమారు 15 మంది మాదిగ జాతి వ్యక్తులపై జరిగితే ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం బట్టి వివక్షత కనబరుస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేనియెడల భవిష్యత్తులో రాష్ట్రంలోని 35 లక్షల మంది మాదిగల నుంచి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉం టుందని హెచ్చరించారు. ఈ సమావేశం లో ఎమ్మార్పీఎస్ నాయకులు కోడి కిషోర్, వంగల వీర్రాజు, తలారి నాని, హనుమంతరావు, ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**వృద్ధుని సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన**

# డిఎల్ఎస్ఎ న్యాయవాదులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 30 ఏళ్లుగా రాజమహేంద్రవరం రూరల్, కొంతమూరులో నివసిస్తున్నప్పటికీ ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు అందక నిస్సహాయ స్థితిలో ఇబ్బంది పడుతున్న వృద్ధుని సమస్యను అధికారులు దృష్టికి తీసుకు వెళ్లిన ఉదంతం ఇది. రాజమహేంద్రవరంకు చెందిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది ధర్నాలకోట వెంకటేశ్వరరావు, సంస్థ పారా లీగల్ వాలంటీర్ ఎద్దు కాటంస్వామిలు కోరుకొండ మండలం గాడాల గ్రామం నుండి శనివారం ఉదయం రాజమహేంద్రవరం వెళ్తున్నారు. కొంతమూరు సెంటర్ సమీపంలో సుమారు 65 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు అత్యంత దయనీయ స్థితిలో రోడ్డు ప్రక్కన నిలబడి బాధపడుతుండగా వీరిద్దరూ గుర్తించారు. వెంటనే అతను వద్దకు వెళ్లి అతని యోగక్షేమములు అడిగి తెలుసుకున్నారు. తన పేరు భీమశంకరం అని, గత 30 ఏళ్లుగా కొంతమూరులో ఉంటున్నానని, తనకంటూ ఎవరూ లేరని బోరున విలపించాడు. వెంటనే స్పందించిన న్యాయవాది ధర్నాలకోట వెంకటేశ్వరరావు, పి ఎల్ వి కాటంస్వామిలు అతనిని ఓదార్చి అతనికవసరమైన ఆహారం అందించారు. అనంతరం అతనికి ఆధార్ కార్డు లేకపోవడంతో ఇప్పటివరకు ప్రభుత్వానికి సంబంధించిన ఒక్క పథకం కూడా లబ్ధి చేకూరకపోవడంతో వెంటనే అతన్ని స్వయంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి పంచాయతీ సిబ్బందికి ధీనస్థితిని తక్షణం అతనికి ఆధార్ కార్డు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని, అలాగే రేషన్ కార్డు, వృద్ధాప్యమించని ఇప్పించాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన పంచాయితీ సెక్రటరీ ద్విభాష్యం శ్రీనివాసరావు మాట్లాడుతూ తప్పనిసరిగా వృద్ధునికి ఆధార్ కార్డుతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా వృద్ధుడు భీమశంకరం తన బాధను అర్థం చేసుకొని అధికారులతో మాట్లాడి తనకు ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛానల్ నాయువాది ధర్నాలకోట వెంకటేశ్వరరావుకు, పారా లీగల్ వాలంటీ ఎద్దు కాటమస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు చేరువ చేయాలి

**ముగిసిన జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం - పలు సూచనలు చేసిన జ్ఞానజ్యోతి ట్రైనింగ్ సెంటర్ కోర్సు డైరెక్టరు పి.రాంబాబు**



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పునాది అభ్యసనం ద్వారా చిన్నారులలో విజ్ఞాన జ్యోతులు వెలిగించాలని జ్ఞానజ్యోతి ఇయర్-2 ట్రైనింగ్ సెంటర్ కోర్సు డైరెక్టరు పి.రాంబాబు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలంలోని కొండగుంటూరు గ్రామంలో గల సత్యశ్రీ పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 9న ప్రారంభమైన డీఆర్పీల ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టరు రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పునాది అభ్యసనం సమర్థవంతంగా అందించాలన్నారు. పునాది అభ్యసనం బలంగా ఉండాలని, ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు చేరువ చేయాలన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన ట్రైనింగ్ ను పొందిన డీఆర్పీలు మండల స్థాయిలో తిరిగి సమర్థవంతంగా అంగన్వాడీ వర్కర్లకు అందించాలన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలతో పాటుగా, ఏజెన్సీ మండలాలకు చెందిన 266 మంది ట్రైనింగ్ను పొందినట్లు ఆయన తెలిపారు. ట్రైనింగ్ అసోసియేట్ చిన్నిబాబు మాట్లాడుతూ త్వరలోనే రెండవ దశ ట్రైనింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డీఆర్పీలు ఎం.విష్ణు, ఉన్నీసాబేగం, ఎన్ఎస్వీఎస్ నాగలక్ష్మి, ఎన్.పుణ్యవతి, కె.రవికుమార్, జి.సునీత, నాగేశ్వరరావు, టీడీఆర్ఎల్ పద్మావతి, దుర్గాశ్రీనివాస్, టి.వెంకటలక్ష్మి, దిండి శేఖర్, డి.నళినిలకు బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కేఆర్పీలు ఎం.సాంబశివరావు, డి.మమ్మీ, వి.త్రివేణి, వై.సోమరాజు, డి.సంధ్యారాణి, కేవీఆర్ తాతాజీ, వై.విజయశ్రీ, ఐ.వెంకటరమణ, వి.వరలక్ష్మి, మైనం ఉమ, ఎం.పూర్ణిమ, ప్రథమ్ కోఆర్డినేటర్లు ఎం.జీవన్ సందీప్, రాజశేఖర్ లు పాల్గొన్నారు.

# శ్రీఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ సోము



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని 13వ వార్డు అంబేద్కర్ నగర్లో ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహా విష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, ఎస్సీ సెల్ బిజెపి జిల్లా అధ్యక్షుడు తగరం సురేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాలేపు సాయి రామ్, సుబ్రహ్మణ్యం ,మండల ప్రెసిడెంట్ చింతపల్లి సాయి,వార్డు ఇంచార్జి పోలవరపు రాము, చింతపల్లి సతీష్ , మాదవి , భవాని,ఎస్సీ మోర్చా నాయకులు యజ్జల శ్రీనివాస్,ఎర్రరపు రాము, బంగారు గిరిబాబు, మీసాల సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడి కేసులు విచారించకుంటే ఆమరణదీక్ష

**- మాజీ ఎంపి జివి హర్షకుమార్ - కక్ష సాధింపు కేసులే విచారణ చేస్తారా? - దళితులపై దాడి కేసులు ప్రభుత్వానికి పట్టవా?**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు కేసులకు ఇస్తున్న ప్రాధాన్యత గత ప్రభుత్వంలో దళితులపై జరిగిన కేసులపై ఎందుకు ఇవ్వడం లేదని మాజీ పార్లమెంట్ సభ్యులు జివి హర్షకుమార్ ప్రశ్నించారు. స్థానిక రాజీవ్గాంధీ కళాశాలలోని సమావేశపు హాలులో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్ను వేధింపులకు గురిచేసి ఆయన మరణించేలాగా చేశారని, మాస్ పెట్టుకోలేదని వెలిచర్ల కిరణ్కుమార్ అనే యువకుడిని లాకప్ డెత్ చేశారని గుర్తు చేశారు. గత జగన్ ప్రభుత్వంలో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయని, వాటిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎందుకు విచారణ జరిపి దోషులను శిక్షించడం లేదని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో మీ పార్టీ కార్యాలయాలు, మీ ఇళ్ళపై జరిగిన దాడుల కేసులను విచారణ జరిపిస్తున్నారని, రాజకీయంగా కక్ష సాధించే కేసులను మాత్రం పున: ప్రారంభించి విచారణ జరిపిస్తున్నారని, దళితుల కేసుల విషయంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. వెలిచర్ల కిరణ్కుమార్ కేసు లాకప్ డెత్ అని జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్ధారణ చేసి అందుకు కారకులైన సిఐ, ఎస్సై, ఇతర పోలీసులపై 302 సెక్షన్లు కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. డెడ్బాడీ డెలివరీ కేసును పున: విచారణ జరిపించడంలో చూపిస్తున్న ఉత్సాహం దళితుల కేసులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. అట్రాసిటీ కేసుల్లో నష్టపరిహారం ఇచ్చేశామంటూ ఎస్పీ స్థాయి అధికారులు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నష్టపరిహారం ఇస్తే సరిపోతుందా? నిందితులకు శిక్షలు వేసి బాధితులకు న్యాయం చేయరా అని ప్రశ్నించారు. దళితులపై జరిగిన దాడి కేసులను విచారించాలని కోరుతూ తాను అమరణ దీక్షకు దిగుతానన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేవాలయాల వద్ద జరిగిన తొక్కిసలాటలో అనేక మంది చనిపోయారని, కల్తీపాలు, బాణాసంచా కేంద్రంలో అగ్నిప్రమాదంలో అనేక మంది చనిపోయారని, ఈ కేసులు నమోదు చేసి విచారణ జరిపించి, నిందుతులను కఠినంగా శిక్షించాలన్నారు.

**డిప్యూటీ స్పీకర్ వైఖరి సరికాదు**

ఆకివీడులోని పెదపేటలో ఆలయ నిర్మాణం విషయంలో స్థానికుల మనోభావాలకు వ్యతిరేకంగా ఎపి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు వ్యహరించిన తీరు సరికాదని హర్షకుమార్ అన్నారు. ఆ గ్రామంలో అధికంగా క్రైస్తవులు ఉండటం చేత అక్కడ రామాలయం కాకుండా స్థానిక ప్రజలకు ఉపయోగార్థం కమ్యూనిటీ హాలును నిర్మించాలని స్థానికులు కోరగా ఆలయాన్నే నిర్మిస్తామంటూ అక్కడ ఇరువర్గాల మధ్య గొడవకు కారణం కావడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులు అంటే ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. గత ప్రభుత్వాన్ని ఎస్సీలే గెలిపించారన్న కక్షతో సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు.

**ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ అడ్డుకోవద్దు**

ఈనెల 24న స్థానిక లూథరగిరిలో ఏర్పాటుచేస్తున్న ప్రవీణ్ పగడాల సంస్మరణ సభను ప్రభుత్వం అడ్డుకోరాదని హర్షకుమార్ కోరారు. గత ఏడాది ప్రవీణ్ పగడాల మరణించిన చోట కొవ్వత్తులు వెలిగించి, ప్రార్ధనలు చేసే కార్యక్రమానికి వేలాదిగా క్రైస్తవ జనులు వచ్చారని, పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేసినప్పటికీ అడ్డుకోలేకపోయారని గుర్తు చేశారు. శాంతియుతంగా నిర్వహించుకునే సంస్మరణ సభకు అడ్డంకులు పెట్టొద్దని కోరారు. ఇప్పటికే సంస్మరణ సభకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పమని, వాటిని సరిదిద్దుకుంటామని తెలియజేశామని, ఇప్పటి వరకు తమకు ఎటువంటి సమాధానం రాలేదన్నారు. ప్రవీణ్ పగడాల పోస్టు మార్టం రిపోర్టు గమనిస్తే ఆయన మద్యం సేవించలేదని, ఒంటిపై గాయాలు ఉన్నాయని వెల్లడిఅవుతున్నాయన్నారు. ఇది ముమ్మాటికీ హత్యేనని, అయితే ఒక పాస్టర్ తాగుతూ వచ్చి రోడ్డు ప్రమాదానికి గురైనట్లుగా చిత్రీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఈ కేసులో కౌంటర్ అఫిడవిట్ ఎందుకు సమర్పించలేకపోయారని ప్రశ్నించారు. ప్రవీణ్ పగడాల హత్యకేసులో మీ హస్తం ఉందా, కేంద్రం హస్తం ఉందా, ఆరఎసఎస్ వంటి సంస్థ హస్తం ఉందా అని నిలదీశారు.

**పునర్వికా లాంటి వారిని ప్రభుత్వమే ఆదుకోవాలి**

అంతుచిక్కని వ్యాధుల బారిన పడి, కోట్ల రూపాయల వైద్య ఖర్చులు అయ్యే పునర్వికా వంటి వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని హర్షకుమార్ కోరారు. పునర్విక విషయంలో క్రౌడ్ ఫండ్ కార్యాక్రమంలో రూ.10కోట్లు సమీకరించిన తర్వాత ప్రభుత్వం స్పందించిందని, ప్రతి సారి క్రౌండ్ ఫండ్ అనేది సాధ్యం కాదన్నారు. ఇలాంటి వారిని ఆదుకోవడానికి ప్రభుత్వమే ముందుకు రావాలన్నారు. దీనిపై ప్రభుత్వమే ఒక పాలసీ తీసుకువచ్చే విధంగా ఎసఎంఎ స్క్రీనింగ్ పేరుతో ఉద్యమ కార్యక్రమాన్ని సోషల్ జస్టిస్ సంస్థకు చెందిన ప్రదీప్ చేపట్టారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రదీప్ మాట్లాడుతూ పునర్విక వంటి కేసుల్లో ప్రభుత్వమే స్పందించి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నుండి ఒత్తిడి తెచ్చే విధంగా ఎస్ఎంఎ స్క్రీనింగ్ నినాదంతో పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జివి శ్రీరాజ్, జివి సుందర్, పెదపేట గ్రామానికి చెందిన ఎండి ఇస్మయిల్, మత్త రాజ్కుమార్, రాజేష్కన్నా, డేవిడ్ మనోహర్, పీతల రాజు, గోపి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


విశ్వం వాయిస్ / విశ్వం VOICE TV

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS

WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



గచ్చకాయలపొరలో సముద్రంలోకి

# 300 తాబేలు పిల్లల విడుదల

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

నేలరేవు, గచ్చకాయలపొర, వాసాలతిప్ప, ఎస్.యానం ప్రాంతాల సముద్ర తీరంలో సేకరించిన సుమారు 50,000 తాబేలు గుడ్లను ఇంక్యుబేషన్ సెంటర్‌లో 45 రోజుల పాటు భద్రపరిచిన అనంతరం తొలి దశలో 300 తాబేలు పిల్లలు పుట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం గచ్చకాయలపర వద్ద ఆ తాబేలు పిల్లలను సముద్రంలోకి విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రపు తాబేళ్ల సంరక్షణలో ఇంక్యుబేషన్ సెంటర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో లభించిన గుడ్లను సురక్షితంగా పిల్లలుగా మారేలా చేసే 'హ్యాచరీ మేనేజ్‌మెంట్' ప్రక్రియను అటవీ శాఖ చేపడుతోందన్నారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా ఐదు దశలు ఉంటాయని తెలిపారు. మొదటగా తాబేళ్లు ఇసుకలో గుడ్లు పెట్టి వెళ్లిపోయిన తర్వాత కుక్కలు లేదా ఇతర జంతువుల నుండి వాటిని రక్షించేందుకు అటవీ శాఖ సిబ్బంది గుడ్లను సేకరిస్తారని చెప్పారు. గుడ్లను సేకరించే సమయంలో వాటిని తిప్పకుండా, గుడ్డు లోపల ఉన్న పిండం దెబ్బతినకుండా అదే స్థితిలో గంపలు లేదా సంచుల్లో ఉంచి ఇంక్యుబేషన్ సెంటర్‌కు తరలిస్తారని వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్.వి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్‌లో సహజ గూడు లాగా ఉండేలా ఇసుకలో గుంతలు తవ్వి కృత్రిమ గూళ్లు నిర్మిస్తారని తెలిపారు. సాధారణంగా 1.5 నుంచి 2 అడుగుల లోతులో పైభాగం ఇరుకుగా, అడుగు భాగం వెడల్పుగా ఉండేలా కుండ ఆకారంలో గూడు సిద్ధం చేస్తారని చెప్పారు. సేకరించిన గుడ్లను జాగ్రత్తగా ఈ గూళ్లలో ఉంచి పైభాగాన్ని ఇసుకతో కప్పి ప్రతి గూడు వద్ద నంబర్, గుడ్లు పెట్టిన తేదీ గుర్తుగా నమోదు చేస్తారన్నారు. ఇసుక ఉష్ణోగ్రత సుమారు 29 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే ఆడ తాబేళ్లు, తక్కువగా ఉంటే మగ తాబేళ్లు పుట్టే అవకాశముందని తెలిపారు. తాబేలు గుడ్లు పిల్లలుగా మారడానికి సాధారణంగా 45 నుంచి 60 రోజులు పడుతుందని చెప్పారు. ఈ సమయంలో గూళ్ల చుట్టూ నెట్‌లు ఏర్పాటు చేసి పిల్లలు బయటకు వచ్చినప్పుడు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటారన్నారు. గుడ్ల నుండి పిల్లలు బయటకు వచ్చిన వెంటనే సముద్రంలోకి వదలడం ఉత్తమమని, సాధారణంగా రాత్రి వేళల్లో లేదా తెల్లవారుజామున విడుదల చేస్తారని తెలిపారు. అదే విధంగా గచ్చకాయలపర వద్ద తెల్లవారుజామున తాబేలు పిల్లలను విడుదల చేసినట్లు చెప్పారు. దీనివల్ల పక్షులు లేదా ఎండ వేడి నుండి వాటిని రక్షించవచ్చని పేర్కొన్నారు. పిల్లలను నేరుగా నీటిలో వేయకుండా తీరానికి కొంత దూరంలో ఇసుకపై వదిలితే అవి స్వయంగా సముద్రం వైపు పాకుతూ వెళ్లి సముద్రంలోకి చేరతాయని వివరించారు. భవిష్యత్తులో అవి పెద్దవిగా మారిన తర్వాత మళ్లీ ఇదే తీరానికి వచ్చి గుడ్లు పెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికిరణ్, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమలో వరుస దొంగతనాల కేసులు ఛేదించిన పోలీసులు

## రూ.30 లక్షలకు పైగా ఆభరణాల స్వాధీనం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగం వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగలను అరెస్ట్ చేసి భారీగా ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. రామచంద్రాపురం, మలికిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించినట్లు తెలిపారు. గత నెల 24వ తేదీన రామచంద్రాపురం పట్టణం రైస్‌పేటలో జరిగిన దొంగతనంపై నమోదైన క్రైమ్ నంబర్ 34/2026 కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పాత నేరస్థుడు ఖండవల్లి సీతారాముడు (48)ను రామచంద్రాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి సుమారు రూ.13.20 లక్షల విలువైన 9.4 తులాలు (109.604 గ్రాములు) బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిపై గతంలో భీమవరం, గణపవరం ప్రాంతాల్లో కూడా పలు కేసులు నమోదయ్యాయి. మలికిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 39/2026 కేసులో దొంగతనానికి పాల్పడిన కట్టా అర్జున్ (26)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతనిపై కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో సుమారు 18కి పైగా దొంగతనాల కేసులు ఉన్నాయి. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు మండేల నాగ భాస్కర్ రావు, కర్రి రాము పరారీలో ఉన్నారు. నిందితుడి నుండి 106 గ్రాముల బంగారం (విలువ సుమారు రూ.15,37,000), 618 గ్రాముల వెండి (విలువ సుమారు రూ.1,79,220) స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో కలిపి సుమారు రూ.30,36,220 విలువైన బంగారం, వెండి ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఈ కేసులను ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు. రామచంద్రాపురం బృందంలో ఉప పోలీస్ అధికారి టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకట నారాయణ సిబ్బంది పాల్గొన్నారు. మలికిపురం బృందంలో కొత్తపేట ఉప పోలీస్ అధికారి సుంకర మురళీ మోహన్, రాజోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.వి. నరేష్ కుమార్, మలికిపురం ఉప ఇన్‌స్పెక్టర్ పి.వి.ఎస్.ఎస్.ఎన్. సురేష్, అమలాపురం క్రైమ్ కంట్రోల్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్, వారి బృందాలు పనిచేశాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరంతర నేరాలకు పాల్పడుతున్న కట్టా అర్జున్ వంటి వారిపై నిర్బంధ చట్టం కింద చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాదులు

## ఘనంగా టీడీపీ 2,7,8 వార్డు కమిటీల ప్రమాణ స్వీకారం

## ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసి చైర్మన్ అక్కల



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 2, 7, 8 వార్డుల అధ్యక్షులు మరియు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వార్డు అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వార్డు అధ్యక్షులు, కమిటీ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

**అధ్యక్ష, కార్యదర్శులు వీరే**

రెండో వార్డ్ అధ్యక్ష కార్యదర్శులుగా గలింకి సూరిబాబు, గల్లిదేవర సుధాకర్, ఏడో వార్డు గణేష్ నగర్ అధ్యక్ష కార్యదర్శులుగా టేకుమూడి సామ్యూల్, మేడిశెట్టి శ్రీ మసేను లు, 8 వ వార్డు గంగమల్ల వారి వీధి అధ్యక్ష కార్యదర్శులుగా చిక్కాల వీరాస్వామి, భూపతి సంధ్యారాణి లతో పాటు కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, క్లస్టర్ వన్ మేడిశెట్టి సూర్యనారాయణ క్లస్టర్ 2 ఇన్చార్జి కంచుమర్తి బాబురావు ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. యూనిట్ ఇన్చార్జులు పెందుర్తి విజయలక్ష్మి చింతాకులు ప్రకాష్, ఉపాధ్యక్షులు చందమామ వాసు, సెక్రటరీ కవల నానాజీ, రెండో వార్డ్ కౌన్సిలర్ సుధీర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు దిగుమర్తి వీరబాబు, మాజీ కౌన్సిలర్లు గడి గోవిందు అల్లం శ్రీను, కట్ట నాగేశ్వరరావు, దంగేటి గౌరీ శంకర్, బల్ల శివరామకృష్ణ, గడి జగన్ బ్రహ్మం మురళి, మనోజ్, వార్డు పెద్దలు గాలికి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్యుల నిర్లక్ష్యం..

## వైద్యుల బాధ్యతారాహిత్యం కారణంగా లక్షల రూపాయల విలువైన పాడి ఆవుల మృత్యువాత





**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్** : రాజోలు నియోజకవర్గ పరిధిలోని మలికిపురం మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన రైతు బొలిశెట్టి అప్పారావు తన పాడి ఆవు నెలలు నిండి ఈనే దశలో ఉండటంతో వైద్య సహాయం కోరారు. రైతు గుడిమెల్లంక, మోరి ప్రాంతాలకు చెందిన పశువైద్యులు వచ్చి చికిత్స చేసిన, వారి నిర్లక్ష్య వైద్యం కారణంగా నిండు గర్భిణీగా ఉన్న ఆవు మృతి చెందిందని బాధితుడు తెలిపారు. రైతు చేతే కత్తి తెప్పించి దూడ తలను డాక్టర్ నరికారని రైతు తెలిపారు. కన్నబిడ్డలా పెంచుకున్న ఆవు కళ్లముందే ప్రాణాలు వదలడంతో తల్లడిల్లిన రైతు అప్పారావు కుటుంబం తల్లడిల్లిపోయింది. 20 రోజుల క్రితం మోరి గ్రామంలో కటికినేడి సత్యనారాయణ రైతుకు చెందిన ఆవు కూడా ఇలాగే వైద్యుల నిర్లక్ష్యానికి బలి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆవులు, వైద్యుల అజాగ్రత్త వల్ల చనిపోతుండటంతో తాముఆర్థికంగాకుంగిపోతున్నామని రైతులు ఆవేదన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, సరైన చికిత్స అందించని సదరు పశువైద్యులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న మట్టపర్రు గ్రామ రైతులు చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం నిర్వహించి, బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేశారు.

# మైనారిటీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - జాంపేటలో ఇఫ్తార్ విందుకు హాజరు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : ముస్లిం మైనారిటీల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జాంపేటలోని లబాబిన్ లైన్ మసీదు, తాజ్ హోటల్ వద్ద మైనారిటీ ముఖ్య నాయకులు మహమ్మద్ అబ్దుల్లా ఆధ్వర్యంలో... భవానీ చారిటబుల్ ట్రస్టు సారధ్యంలో ముస్లిం మైనారిటీలు, అలాగే పార్టీ కేడర్‌కు శనివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరిగిన ముస్లింల మతపరమైన ప్రార్థనల్లో పాల్గొని మైనారిటీ ముఖ్య నాయకులు మహమ్మద్ అబ్దుల్లా, ఛాన్ బాషా, బషీర్, అస్లాం, మహబూబ్ జానీ, ఖాన్, మహబూబ్ ఖాన్, అమీర్ రాజా తదితర ముస్లిం మైనారిటీ పెద్దలతో కలిసి ఇఫ్తార్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని మతాలను ఏకం చేసేదే ఈ పవిత్రమైన ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసం, ప్రార్థనలు మనల్ని ఆత్మవిశ్వాసం, కరుణ, సోదరత్వం వైపు నడిపిస్తాయన్నారు. రంజాన్ మనకు బోధించే సత్యం ఏమిటంటే... మనం అందరూ ఒకే దేవుని సృష్టులం, భగవంతుని మార్గంలో ఐక్యంగా నడవాలని సూచిస్తోందన్నారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేసింది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలి

## బిక్కవోలు మండలం,ఆర్‌ఎస్ పేటలో తడిచెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం



**బిక్కవోలు, విశ్వం వాయిస్ న్యూస్** : గ్రామాన్ని స్వచ్ఛత కలిగిన,పరిశుభ్రమైన ప్రాంతంగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరు భాధ్యత వహించి, సహకరించాలని బిక్కవోలు డిప్యూటీ ఎంపీడీవో మెల్టన్ సూచించారు. తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు మండలం, ఆర్.ఎస్ పేట గ్రామంలో ఇండియన్ టుబాకో కంపెనీ (ఐ.టి.సి), ఎమ్మెస్కె వాష్ ఇన్స్టిట్యూట్ ఆద్వర్యంలో తడిచెత్త, పొడిచెత్త నిర్వహణ పై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మెల్టన్ మాట్లాడుతూ ఇళ్ళ లోని వ్యర్థాలతో గ్రామంలో సంపద తయారీకి అందరూ సహకరించాలని, దీనికొరకు తడిచెత్త, పొడిచెత్తను వేరు వేరుగా భద్రపరిచి శానిటేషన్ సిబ్బంది లేదా గ్రీన్ గార్డ్స్ కు అందించాలని వివరించారు. అనంతరం ఐ.టి.సి వాష్ ఇన్స్టిట్యూట్ ఎస్డబ్ల్యూ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజబాబు మాట్లాడుతూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇది రాబోయే మంచి పునాది అవుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించి గ్రామంలో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు మోహన్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, విజయరాజు, ఆర్.ఎస్ పేట ఎస్.హెచ్.జి గ్రూప్ సభ్యులు, గ్రామ మహిళలు, పంచాయతీ సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

దునబోయిన ప్రసాద్‌కు

# అక్షయ ఆర్థిక సహాయం



**విశ్వం వాయిస్ న్యూస్** : కొత్తపేట మండలం బిళ్ళకర్రు గ్రామానికి చెందిన దునబోయిన ప్రసాద్‌కి రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ ట్రాన్స్ప్లేషన్ చేయించుకోవడానికి 20 లక్షల వరకు ఖర్చవుతాదని డాక్టర్ చెప్పారని తెలియజేసారు వీళ్ళ పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా 10000 రూపాయలు అక్షయ సేవా సంస్థ సభ్యుల చేతుల మీదుగా ప్రసాద్ అన్నయ్యకు ఇవ్వడం జరిగింది. దీనికి సహకరించిన సంస్థ సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు.


# వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్** : కడియం మండలం కడియపులంకకు చెందిన ఏపీఐఐసీ డైరెక్టర్,హరహర మహక్షేత్రం చైర్మన్, వీర హనుమాన్ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ జన్మదిన వేడుకలు శనివారం వృద్ధ ఆశ్రమంలో పేదల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా నామవరం మానవీయం ఆశ్రమంలో వృద్దులు, దివ్యాంగులు,అనాథలకు దుస్తులు పంపిణీ చేసి భోజనం ఏర్పాట్లు చేశారు.వారి మధ్యనే కేక్ కట్ చేసి పుట్టినరోజు జరుపుకున్నారు.అలాగే ఉదయం నుంచి ఆయనకు టిడిపి,జనసేన, బిజెపి నాయకులు, అభిమానులు, నర్సరీ రైతులు, గ్రామస్థులు, ప్రముకులు ప్రత్యక్షంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# శానపల్లి లంకలో ఉచిత మెడికల్ క్యాంపు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



నిరుపేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామని కోనసీమ కేర్ హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ కారెం రవితేజ తెలిపారు. అయినవిల్లి మండలం శానపల్లి లంక హైస్కూల్ వద్ద గ్రామంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పంబాల కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జ్వరం, షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను కోనసీమ కేర్ ఆసుపత్రి సిబ్బంది ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా స్కానింగ్, ఈసీజీతో పాటు షుగర్ పరీక్షలు నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ కారెం రవితేజను స్థానిక ప్రజలు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు గొంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ శ్రీనివాస్‌తో పాటు గ్రామస్థులు, రోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండపేట నుండి పార్టీ పరిశీలకులుగా

# కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు

## అభినందించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మాజీ ముఖ్యమంత్రి, వైయస్‌అర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలమేరకు మండపేట నియోజకవర్గం నుండి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా కర్రి పాపారాయుడు, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా దూలం వెంకన్నబాబు నియమితులైన సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వారిని అభినందించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ వైస్ ప్రెసిడెంట్ గా పిల్లా వీరబాబు నియమితులైన సందర్భంగా వీరిని మండపేట నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేసారు. దుస్సలువాలతో సత్కరించారు. పార్టీ విజయానికి ఆయా నియోజకవర్గాల్లో కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండపేట రూరల్ మండల వైసిపి పార్టీ ప్రెసిడెంట్ అడబాల బాబ్జి, టౌన్ వైసిపి ప్రెసిడెంట్ పిల్లి శ్రీను, మాజీ ఏ ఏం సి చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, పార్టీ నాయకులు అద్దంకి రమణ, పోతుల దుర్గాప్రసాద్,యారమటి వెంకన్నబాబు, వాసిరెడ్డి అర్జున్, తిరుసుల శ్రీనివాస్, వనం నారాయణ, రామకృష్ణ, మండపల్లి రవి, తణుకు అశోక్, బందెల సాయిరామ్, బిళ్ళ గుర్తి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

ఆదివారం, 15 మార్చి 2026
www.viswamvoice.com





# పులి సంచారం చాలా చురుకుగా ఉంది..!

- అచ్చంపేట, గొంధి కొత్తపల్లిలోనే సంచారం
- అచ్చంపేట - గొంధికొత్తపల్లి రాదారి మూసివేత
- తాత్కాలిక విద్యుత్తు సరఫరా నిలిపివేత
- పాత చోటు విడచి కొత్త చోటుకు పయనం
- పులి ఆచూకీ కోసం డ్రోన్ గాలింపు
- శాటిలైట్ రేడియో సమాచారం విశ్లేషణ
- రెండు ఇనుప ఉచ్చుల బోనులు ఏర్పాటు
- ట్రాంక్విలైజర్ ఇంజెక్షన్ బృందం సిద్ధం
- నాగార్జునసాగర్, శ్రీశైలం రెస్క్యూ బృందాలు సిద్ధం
- ప్రజలు భయాందోళనలు పడాల్సిందేమీ లేదు
- అటవీశాఖ అధికారులు చెప్పింది పాటిస్తే చాలు
- అటవీ, పోలీసు, రెవిన్యూ శాఖల సమన్వయం
- మీడియాతో డిఎఫ్ఓ రామచంద్రరావు ప్రకటన




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం రెవిన్యూ డివిజన్ పరిధి మెట్ట ప్రాంత ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అచ్చంపేట, గొంధి కొత్తపల్లి గ్రామాల పరిధిలోని పొలాలు, తాగునీటి వనరులున్న ప్రాంతాల్లోనే పులి సంచారం చాలా చురుకుగా ఉంది. ఈ ప్రాంతాన్ని విడిచి వేరే ప్రాంతానికి వెళ్లలేదని ఇప్పటికే గమనించిన పులి కదలికలు, దాని పాద ముద్రలు, ఓ దూడను చంపి 200 మీటర్ల దూరం ఊడ్చుకు వెళ్లిన ఆనవాళ్లను బట్టి పూర్తి అధ్యయనం తర్వాత అటవీశాఖ అధికారులు బలంగా విశ్వసిస్తున్నారు. దీంతో అచ్చంపేట సమీపంలోని నీటి వనరులైన పెదబాపన్నదొర చెరువు, ఏలేరు రిజర్వాయరు ఎడమ నీటి కాల్వ సమీపం లోనికి నీటిని తాగడానికి పులి రావచ్చనే ఒక అంచనాతో ఇనుప ఉచ్చుల బోనును ఏర్పాటు చేశారు. ఇక దానితో పాటు రెండో బోనును కూడా సిద్ధంగా ఉంచారు. దీనిని ఎక్కడ అమర్చాలనే విషయమై అధ్యయనం చేస్తున్నారు. ఐతే ఈ పులి తెలివిగా చాకచక్యంగా వ్యవహరిస్తున్న తీరు మాత్రం అటవీశాఖ అధికారుల ఊహలకు, అంచనాలకు అందడం లేదు. సాధారణంగా ఒక జీవిని ఆహారం కోసం ఒక సారి వేటాడిన పులి ఆహారాన్ని స్వీకరించాక ఎక్కడెక్కడ సంచరించినా తిరిగి రెండు మూడు రోజులపాటు మళ్ళీ పాత ఆహారం వద్దకే సహజంగా వస్తుంది. ఇది పులి అలవాటు. ఐతే దీనికి భిన్నంగా కొత్త



చోటుకు చాలా వేగంగా మారి పోతోందని అధికారులు భావిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో అచ్చంపేటలో బొట్టా సత్యనారాయణ పొలంలో ఆవు దూడను చంపి తిన్న పులి ఇంకా అదే ప్రాంతంలోని తోటల్లోనే తిష్ట వేసి ఉన్నట్టు పులికి ఉన్న శాటిలైట్ రేడియో కాలర్ పరికరం, ఇక డ్రోన్ కెమెరా ఆధారంగా అటవీశాఖ అధికారులు ధృవీకరించు కున్నారు. ఆ సమీపంలోనే అటవీశాఖ అధికారులు, పోలీసు, రెవిన్యూశాఖల అధికారుల సమన్వయంతో పహారా కాస్తూ పులిని బందించేందుకు సంసిద్ధంగా ఉన్నారు. వారితో పాటు ట్రాంక్విలైజర్ ఇంజెక్షన్ ఇచ్చే నిపుణుల సిబ్బంది బృందాన్ని, అలాగే నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన ప్రత్యే రెస్క్యూ బృందాలనూ సిద్ధంగా ఉంచారు. ఈ పరిస్థితుల్లో అటువైపుగా ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు అచ్చంపేట - గొంధి కొత్తపల్లి గ్రామాల మధ్య ప్రజా సంచారాన్ని నిషేధిస్తూ రహదారి మార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. దీంతో రాకపోకలు బంద్లై ఏ ఊరు వారు ఆ ఊరికే పరిమితం అయ్యారు. వ్యవసాయ పనులు స్థంభించాయి. అంతే కాకుండా పులికి, మనుషులకు కూడా విద్యుత్ఘాతం సంభవించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్తు సరఫరాను కూడా తాత్కాలిక నిలిపివేశారు. ఈ మెత్తం వ్యవహారాన్ని దగ్గర ఉండి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. తాము చెప్పిన జాగ్రత్తలు పాటిస్తే..., చేయొద్దన్నది మానేస్తే చాలు అన్నారు. పులి తనంత తానుగా అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతే మరీ మంచిది. లేదంటే బోను, మత్తు మందు ఇంజెక్షన్ ఇచ్చి శాంత పరిచే సురక్షిత పద్దతుల్లో పులిని బందించేందుకు అన్ని రకాల వ్యూహాలతో సిబ్బంది బృందాలు సిద్ధంగా ఉన్నాయి అన్నారు. ఇక ప్రజల ఆవు దూడను పులి చంపిన నేపథ్యంలో సదరు దూడ యజమానికి అటవీశాఖ ద్వారా నష్టపరిహారాన్ని చెల్లించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుంది అన్నారు.

## జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి**

**20 వేల సభ్యత్వాలే మా లక్ష్యం - పెంటకోట మోహన్, గాబు సుభాష్**



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో సొసైటీ చైర్మన్, జనసేన జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్ ఆధ్వర్యంలో జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి హాజరై అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ పెంటకోట మోహన్,శంఖవరం మండల జనసేన అధ్యక్షులు గాబు సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మేడిశెట్టి బాబీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో జరుపుకున్నమన్నారు.నియోజకవర్గంలో జరిగిన కొన్ని కార్యక్రమాలకు ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ హాజరై జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నింపారన్నారు.అలాగే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు.ఇప్పటివరకు బాబీ ఆధ్వర్యంలో 11 వేలకు పైగా సభ్యత్వాలు చేయించడం జరిగిందని,20వేల సభ్యత్వాలే లక్ష్యంగా జన సైనికులు పనిచేయాలని పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలే లక్ష్యంగా మేడిశెట్టి బాబి ఆధ్వర్యంలో పని చేస్తూ బలోపేతను కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయ్, పలివెల వెంకటేష్,లారా,అడపా కొండబాబు,లింగంపర్తి గ్రామ జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దుగ్గుదూరు పీహెచ్సీని త్వరగా అప్గ్రేడ్ చేయాలి

**ఎమ్మెల్సీ సోము వీర్రాజుకి బీజేపీ ఇంచార్జ్ శంకర్ వినతి**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం, దుగ్గుదుర్రు (పీహెచ్ సీ) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్ సీ)గా అప్ గ్రేడ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయించాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ నాయకుడు దూడల శంఖర్ నారాయణ కోరారు. గోదావరి జోనల్ పార్టీ కార్యాలయంలో, జనతా వారధి కార్యక్రమంలో భాగంగా జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజుని కలిసి దూడల శంకరనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు 2024 జూలై 8వ తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. దుగ్గుదూరు పీహెచ్సీ ని అప్గ్రేడ్ చేయడం వలన ముఖ్యంగా కాజులూరు మండలంతో పాటు, సుమారు 31 గ్రామాల నుండి 1,09,014 మంది ప్రజలకు దగ్గర్లోనే అన్నిరకాల వైద్య సేవలు అందుతాయని వివరించారు. అప్ గ్రేడ్ చేయడానికి దుగ్గుదుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అన్ని అర్హతలు ఉన్నాయని, నవంబర్ 3, 2024 వ తేదీన కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చినటువంటి నివేదికను, మరియు ఆసుపత్రికి సంబంధించిన అన్ని విషయాలను సోము వీర్రాజుకు, శంకరనారాయణ వివరించి సంబంధిత నివేదికను సమర్పించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ నిధుల నుండి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు తీసుకున్న అగ్రికల్చరల్ ట్రాక్టర్ల సబ్సిడీని, ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 20% సబ్సిడీని విడుదల చేసిందని, మిగిలిన 80% సబ్సిడీని వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. దీనివలన చాలా మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు నష్టపోయిన వడ్డీ నుండి ఉపశమనం కలుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, ఈ విషయంపై ప్రక్రియ వేగవంతం అయ్యేలా చేస్తానని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి రొక్కాల సత్తిబాబు, సోము వీర్రాజును కలిసిన వారిలో ఉన్నారు.

## కాజులూరులో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎమ్ఈఓలు డేవిడ్, జోన్

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండల గ్రామాల్లో ఈ నెల 16వ తేదీ నుంచి ఎప్రిల్ 1వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు డి డేవిడ్, పి జాన్ లు తెలిపారు. కాజులూరు మండలంలోని మూడు పరిక్ష కేంద్రాలలో 14 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 576 మంది పదవతరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. కాజులూరు పరిక్షా కేంద్రంలో 267 మంది, గొల్లపాలెం పరిక్ష కేంద్రంలో 171 మంది, కుయ్యేరు కేంద్రంలో 138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వారు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఈ పరిక్షలు జరుగుతాయని విద్యార్థులు సమయానికి ముందు ముందుగానే పరిక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు స్కూల్ యూనిఫామ్లో కాకుండా సివిల్ డ్రెస్సు ధరించి పరిక్షలకు హాజరు కావాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్ ఈఓ లు డేవిడ్, జాన్ లు స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబానికి తలపంటి బుజ్జి ఆర్థిక సహాయం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామాని చెందిన కోటిపల్లి వెలుగులమ్మ కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని, రూ. 3,000లో నగదు ఆర్థిక సహాయాన్ని మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు, నెల్లిపూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) శనివారం అందజేసారు. వెలుగులమ్మ అనారోగ్యంతో ఈ మధ్య కాలంలో కాలం చేసారు. ఇంటి పెద్ద దిక్కును, జీవనాధారాన్ని కోల్పోయి దుఃఖం, కష్టాల్లో ఉన్న వెలుగులమ్మ కుటుంబ సభ్యులు కోటిపల్లి యాహాన్ రాజ్, కోటిపల్లి త్రిమూర్తులు, కోటిపల్లి జ్యోతి, కోడలు సుప్రియ, సుశీల, దుర్గను పార్టీ అధ్యక్షుడుగా, గ్రామ పెద్దగా బుజ్జి పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని ఓ నమ్మకాన్ని కల్పించారు. అంతే కాకుండా తన వంతు సామాజిక బాధ్యతగా ఈ చిరు సహాయాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో బుజ్జి వెంట నెల్లిపూడి జనసేన నాయకులు సిల్లి పంపరాజు, కూరాడ జాను, శివకోటి ప్రసాద్, నొక్కి వీరబాబు, శివకోటి నీలకంతం, వరి అప్పారావు, తలపంటి బలరాం, పిర్ల నాని, తలపంటి వీరబాబు, తలపంటి వెంకట్ ఉన్నారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్**

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ఈనెల 16వ తేదీ నుండి ఏప్రిల్ 01వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 28,921 విద్యార్థులకు 145 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ తెలిపారు. పరీక్షలు 14,314 మంది బాలురు,14,607 మంది బాలికలు హాజరు కానున్నరు. పరీక్షలు ఉదయం 9:30 నుండి 12.45 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరాలని తెలిపారు. పరీక్షలు నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించి, జిల్లాకు మంచి పేరు తెచ్చేలా పరీక్షలు నిర్వహణ అధికార్లుకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించామని అన్నారు. ఎక్కడ మాస్ కాపీయింగు, పేపర్ పరీక్ష పత్రాలు లీకేజీ వంటివి జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు ఫలితాలు రాష్ట్రంలో ప్రధమ స్థానంలో నిలిచేలా విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించామని, సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కమాండు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని, 9666714898 నెంబరుకు ఫోను చేసి విద్యార్థులకు ఏటువంటి ఇబ్బందులు కలిగినా తెలియ చెయ్యాలన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల విద్యార్థులందరూ హాల్ టికెట్ కొరకు స్వయంగా ఎంవ.ఖజూ.న్రశీఙ.ఱఅ వెబ్ సైట్ నుండి పొందవచ్చును. హాల్ టికెట్ పై సదరు ప్రధానోపాధ్యాయులు సంతకం మరియు స్టాంప్ లేకపోయినను పరీక్షలకు అనుమతించబడును. విద్యార్థులకు పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చెయ్యడం జరిగిందని, హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. పరీక్షల నిర్వహణ కు ఆయా పరీక్ష కేంద్రాలు చీఫ్ సూపరింటెండెంట్,డిపార్ట్మెంట్ ఆఫీసర్స్,1845 మంది ఇన్విజిలేటర్ లను,06 ఆకస్మిక తనిఖీ బృందాలు,24 సిట్టింగ్ తనిఖీ బృందాలను నియమించామని తెలిపారు.అన్ని పరీక్ష కేంద్రాల్లో అవసరమైన ఫర్నిచర్,త్రాగునీరు, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

## పిచ్చి మొక్కలతో నిండిన విశ్రాంతి భవనం



**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** తాళ్ళరేవు మండలం, చెరువుగట్టు సెంటర్లో ప్రయాణికుల సౌకర్యార్థం వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొత్త రాజారావు జ్ఞాపకార్థం వారి కుమారులచే నిర్మించబడిన విశ్రాంతిభవనం ముందు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిందని, ఆ భవనం ముందర పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలు ఉన్నాయి. వాటిని కూడా పట్టించుకోవడంలేదని పంచాయితీ వారు భవనం ముందు శుభ్రపరిచి ప్రయాణికులకు సౌకర్యవంతం చేయాలని పరిసర ప్రజలు కోరుకుంటున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు దృష్టి పెట్టాలని, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాక్షేత్రంలో జనసేన ప్రభంజనం

**పవన్ కల్యాణ్ ఆశయాలే మాకు మార్గదర్శకం : ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** విలువల రాజకీయాలకు నిలువుటద్దం పవన్ కల్యాణ్ అని, ఆయన మార్గదర్శకత్వంలో కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పంతం నానాజీ ఉద్ఘాటించారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాకినాడ రూరల్లో అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం నానాజీ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలపై నానాజీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఒక్క ఛాన్స్" అంటూ అధికారంలోకి వచ్చిన వారు రాష్ట్రాన్ని 10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. సాగునీటి రంగం నుంచి పౌర సరఫరాల వరకు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలను గాడిలో పెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తన నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రతిపక్షాలకు బహిరంగ సవాల్ విసిరారు. స్వల్ప కాలంలోనే సుమారు రూ. 200 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన. దాదాపు రూ. 400 కోట్లతో ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చడం.నేను చెప్పిన ఈ పనులు జరగలేదని ఎవరైనా నిరూపిస్తే, వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే అర్హతే నాకు ఉండదు. ప్రజల కోసం నిరంతరం శ్రమించడమే మా డీఎన్ఏలో ఉంది," అని నానాజీ స్పష్టం చేశారు.

**కూటమి పాలన - భవిష్యత్ లక్ష్యం:**

రాష్ట్రం మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మరో 10 నుండి 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన జెండా రెపరెపలాడాలని, ప్రతి గ్రామంలోనూ పార్టీ సభ్యత్వాన్ని భారీగా పెంచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సర్పంచులుగా, ఎంపీటీసీలుగా జనసైనికులు విజయం సాధించి, గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో జనసేన నాయకులు, వీర మహిళలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంక కార్యాలయం ప్రారంభం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జాతీయ గణాంక కార్యాలయం క్షేత్ర కార్యకలాపాల విభాగం, కాకినాడ నూతన భవనం సముదాయాన్ని ఆ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి సునీత భాస్కర్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక సాల్ట్ కమిషనర్ ఆఫీస్ కాంపౌండ్ జన్మభూమి పార్క్ రోడ్ లో నిర్మించిన నూతన భవన ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక దక్షిణ భారత దేశం లోనే మొట్ట మొదటి సొంత భవనాన్ని కలిగిన ఏకైక కార్యాలయం అని ప్రశంసించారు. 2009 నుండి భవన నిర్మాణ దిశగా ఎంతో ప్రయాస పడినప్పటికిని 2026 నాటికీ కొత్త భవనం సాకరం కావడం అభినందనీయమన్నారు. సిబ్బంది ఉత్సాహంగా పనిచేయటమే కాకుండ కార్యాలయ భవనాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. జోనల్ హెడ్ శ్రీ అనుపమ్ లాహిరి మాట్లాడుతూ భవన నిర్మాణ నికి రిటైర్డ్ అధికారి అయిన కిరణ్ కుమార్ చేసిన కృషిని కొనియాడారు. అదేవిధంగా రిటైర్డ్ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి తన హయాంలో చేసిన అన్ని ప్రయత్నాలు వివరించారు. ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారుల కృషిని కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమలలో భాగంగా కూచిపూడి నృత్యాలు మరియు సీనియర్ స్టాటిస్టికల్ అధికారి కృపానిది కవిత అందరిని అలరించాయి.

**పదో తరగతి విద్యార్థులకు**

## బాసటగా జనసేన


**ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేసిన పితాని వెంకట రాము**



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** పరీక్షల సమయంలో విద్యార్థులకు చిన్నపాటి ప్రోత్సాహం అందించినా అది వారిలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. సరిగ్గా ఇదే ఉద్దేశంతో, జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడ రూరల్లో విద్యార్థులకు అండగా నిలిచే ఒక చక్కని కార్యక్రమం జరిగింది. తిమ్మాపురం గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు జనసేన నాయకులు, తూరంగి మాజీ ఎంపీటీసీ పితాని వెంకట రాము పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, జామెంట్రీ బాక్సులు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పితాని వెంకట రాము మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు, మండలంలోని విద్యార్థులందరూ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి, మంచి ర్యాంకులు సాధించడం ద్వారా కాకినాడ రూరల్ ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమం విద్యార్థులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తమ పరీక్షల వేళ ఇలాంటి సహాయం అందడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

**జనసేన నాయకులు యాళ్ల పండు ఆధ్వర్యంలో**

## ఉచిత కంటి ఆపరేషన్లు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ కరప గ్రామంలో జనసేన 13వ సంవత్సర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన సీనియర్ నాయకులు యాళ్ల వీర వెంకట సత్యనారాయణ (పండు) 120 మందికి ఉచితంగా కళ్ళజోళ్లను, 51 మందికి సోమవారం ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. కపిలేశ్వరం గ్రామానికి చెందిన ఎల్వి ప్రసాద్ కంటి హాస్పిటల్ యాజమాన్యంతో తమ నివాసం వద్ద కరప మరియు చుట్టూప్రక్కల ఉన్న గ్రామాల నిరుపేదలకు 317 మందికి కంటి పరీక్ష చేయగా వాళ్లలో 57 మందికి సోమవారం నాడు ఉచితంగా కంటి ఆపరేషన్లను చేస్తారని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు ప్రతి విషయంలో ఆయన అడుగుజాడల్లో నడిచిన క్రియాశీలక జనసేన నాయకులలో పండు ఒకరు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాటే ఈయనకు వేద వాక్కు. పండు చేసిన ఈ కార్యక్రమానికి హాజరైన జనసేన నాయకులు , టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన వీర మహిళలు అందరూ ఆయనని అభినందించారు.





# దళితులు ఏ పార్టీకి కొమ్ము కాయకండి.. స్వయం శక్తిగా ఎదగాలి

- రాజకీయాల్లో స్వయం నిర్ణాయక శక్తి కావాలి
- రాజకీయాలకు అతీతంగా మాలలు ఐక్యం కావాలి
- పెత్తందారులు చేతుల్లో కీలుబొమ్మలు కారాదు
- నేను సర్పంచ్‌గా కూడా పోటీ చేయను
- ఎయిమ్ వ్యవస్థాపకులు సునీల్‌కుమార్
- దళితులకు ఈ ప్రభుత్వాలు చేసిందేమీ లేదు
- మాజీ ఎంపీ జీవి హర్షకుమార్
- ఉద్య'మాల'వాయిస్ సభలో పలు తీర్మానాలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజకీయాలకు అతీతంగా మాల సామాజికవర్గం అంతా ఐక్యం కావాల్సిన తరుణం ఆసన్నమైందని అంబేద్కర్స్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, సీనియర్ ఐపిఎస్ పివి సునీల్ కుమార్ పిలుపు నిచ్చారు. స్థానిక చెరుకూరి కళ్యాణమండపంలో శనివారం అంబేద్కర్ ఆశయాల సాధనకై ఆస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్య'మాల'వాయిస్ చర్చాగోష్టిలో పి.వి సునీల్‌కుమార్ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి అంబేద్కర్ సేవా కేంద్రం (ఆస్క్) చైర్మన్ లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ దళితులు ఏదో ఒక పార్టీకి కొమ్ము కాయకుండా స్వయం శక్తిగా ఎదగాలన్నారు. పెత్తందారీ పార్టీల చేతుల్లో కీలుబొమ్మలు కారాదన్నారు. రాజకీయాల్లో డబ్బు, అధికారానికి ప్రాధాన్యత ఉంటుందని, కాబట్టి దళితులు ఆర్థికంగా ఎదిగే ప్రయత్నం చేయాలన్నారు. కనీసం వార్డు స్థాయిలో నాయకత్వం వహించగలగే స్థాయికిఎదిగినపుడే మనం ఆపై పదవులకు ఎదగడానకి అవకాశం దక్కుతుందన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలన్నారు. అప్పుడే రాజ్యాధికారం వైపుకు అడుగులు పడతాయన్నారు. రాజ్యాధికారంవైపునకు అంచెలంచెలుగా ఎదగాలన్నారు. మీరంతా నాయకత్వం వహిస్తే తాను మీ వెనుక ఉండి కార్యకర్తగా పనిచేస్తానన్నారు. తాను కనీసం సర్పంచ్‌గా కూడా పోటీ చేయనని, బి.ఫారాలు కొరకు ఎవరివద్ద పాకులాడనన్నారు. మాలలు వర్గీకరణ సమయంలో ఒకసారి, రాష్ట్ర విభజన తర్వాత ఒక సారి వబలహీన పడ్డారన్నారు. అందరిని కలుపుకుని వెల్లడం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించగలమన్నారు. కాపులు, బీసీలు సిఎంలు కావాలన్నా మాలలు సహాయ పడాల్సిందేనన్నారు. అంబేద్కర్ వాది అయితే మాదిగను సిఎం చేయడానికైనా తాను సిద్ధమన్నారు. మాజీ ఎంపి జీవి హర్షకుమార్ మాట్లాడుతూ దళతులకు ఈ ప్రభుత్వాలు చేసిందేమీ లేదన్నారు. ఇందిరమ్మ సమయంలో దళిత వర్గాలకు ఇళ్ళ స్థలాలు అందాయన్నారు. ప్రభుత్వాలు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా దళిత వర్గాలకు లబ్ధి చేకూరలేదన్నారు. దళిత విద్యార్థులకు పిజి వరకు ఉన్న స్కాలర్ షిప్‌లను డిగ్రీ వరకే ఫీజు రిఇంబార్స్‌మెంట్‌ను పరిమితం చేశారన్నారు. గత ప్రభుత్వంలో దళితులపై జరిగిన దాడులపై ఈ ప్రభుత్వంలో ఎందుకు విచారణ జరిపించరని ప్రశ్నించారు. ఉద్య'మాల'వాయిస్ దళిత వర్గాలను చైతన్యవంతం చేసి ముందుకు నడిపించాలన్నారు. ఆస్క్ వ్యస్థాపకులు గుబ్బల రాంబాబు, కన్వీనర్ మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చా గోష్టిలో దళిత ఉద్యమ నాయకులు మల్లెల వెంకట్రావు, దాసి వెంకట్రావు, కొల్లాబత్తుల దిలీప్, రాజేంద్ర, ఈతకోట బాలస్వామి, పిల్లి శివకుమార్, లింగం శివ, మంగరాజు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఉద్య'మాల'వాయిస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేయాలని, రాజకీయాలకు అతీతంగా మాల జనాభాను ఐక్యం చేయాలని, మాలలు అధికంగా ఉన్న చోట పంచాయితీలను కైవసం చేసుకోవాలని, అంబేద్కర్ ఆలోచనా విధానాలను నేటితరం వారికి అదించే కార్యక్రమాలు రూపొందించాలని, అంబేద్కర్ సేవా కేంద్రం(ఆస్క్) సూచనలు, సలహాలతో ఎస్సీఎస్టీ విద్యార్థులకు ప్రోత్సాహం, విజ్ఞాన సదస్సులు, కుల వివక్షతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, హాస్టల్ మెస్‌ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, పెరిగిన ఎస్సీఎస్టీ జనాభా మేరకు నియోజకవర్గాల పునర్విభజన చేసి, ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచాలని, జనాభా ప్రాతిపదికన ఎస్సీఎస్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం, నామినేటెడ్ పదవులు కల్పించాలని, దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని, నూతన విద్యాహక్కు చట్టం మేరకు పెంచిన ఫీజులు తగ్గించాలని, మాల ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై సమావేశం నిరసన వ్యక్తం చేసింది. మాలలపై అంతర్లీనంగా ఉన్న రాజకీయ వివక్షతపై సమావేశం నిరసన వ్యక్తం చేస్తూ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో జి.వి శ్రీరాజ్, కోరుకొండ చిరంజీవి, తాళ్ళూరి బాబూ రాజేంద్రప్రసాద్, సోమాబత్తుల విజయకుమార్, రేగుళ్ళ బాలశ్రీధర్, ఎలిపే శ్రీనివాస్, కస్సే రాజేష్, పెద్దఎత్తున ఎన్.ఏ.డి.పాల్, సోదదాసి స్థాలిన్, జి.వి.సుందర్, మార్క్ చింతపల్లి సూర్య కుమార్, దడాల త్రీనాథ్, సోదదాసి రాహూల్ కుమార్, కొల్లి వినయ్, ఉల్లం రవి, అల్లు జయరాజ్, చింతపల్లి చిట్టిబాబు,దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు
# పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి

**జిల్లాలో 138 కేంద్రాల్లో 24,566 మంది విద్యార్థులు పరీక్షలకు**
**సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు.. పర్యవేక్షణ కట్టుదిట్టం**
**ఈ ఏడాది 90 శాతం పైగా ఉత్తీర్ణత లక్ష్యం : డీఈఓ వాసుదేవరావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. స్థానిక ఎస్‌కేవిటి హై స్కూల్‌లో శనివారం సాయంత్రం డిప్యూటీ డి ఈ వో దిలీప్ కుమార్ తో కలిసి విలేకరులు సమావేశం నిర్వహించారు. డీఈఓ వాసుదేవరావు మాట్లాడుతూ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకోసం జిల్లాలోని 19 మండలాల్లో మొత్తం 138 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక దానవాయిపేటలోని ఎస్‌కేవీటి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో శనివారం సాయంత్రం డిప్యూటీ డీఈఓ దిలీప్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డీఈఓ వాసుదేవరావు మాట్లాడారు. జిల్లాలో మొత్తం 24,566 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వీరిలో 12,568 మంది బాలురు, 11,998 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని, తప్పనిసరిగా ఉదయం 9.15 గంటల లోపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 దాటిన తర్వాత పరీక్షా హాలులోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్ టికెట్లు ఇవ్వడానికి ఫీజులు చెల్లించలేదని కొందరు ప్రచారం చేస్తున్న వార్తల్లో నిజం లేదని డీఈఓ తెలిపారు. ఎవరికైనా హాల్ టికెట్ అందకపోతే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చని సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలోని 138 కేంద్రాల్లో సుమారు 1,600 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. ప్రశ్నాపత్రాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయని, వాటిని 22 పోలీసు స్టేషన్లలో భద్రపరిచినట్లు చెప్పారు. ప్రతి రోజు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్ల ద్వారా పోలీసు స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఒక విద్యాశాఖ అధికారి, ఒక రెవెన్యూ అధికారి, ఒక పోలీసు అధికారితో కూడిన ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 18 సిట్టింగ్ స్క్వాడ్లు, 18 రూట్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. జిల్లాలో ఎనిమిది సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో జిల్లాలో 2023లో 70 శాతం, 2024లో 83 శాతం, 2025లో 88 శాతం ఉత్తీర్ణత నమోదైందని డీఈఓ పేర్కొన్నారు. ఈ ఏడాది 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా అమలు చేసినందున 90 శాతం పైగా ఉత్తీర్ణత సాధిస్తామనే నమ్మకం ఉందని తెలిపారు. సౌకర్యాలు విస్తృతంగా ఉన్నందున బాలవిజ్ఞాన మందిరంలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

# సామాజిక ఐక్యతకు ఇఫ్తార్ విందులు నిదర్శనం : ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** హిందూ ముస్లిం క్రైస్తవుల ఐక్యత కు రంజాన్ ఇఫ్తార్ విందు నిదర్శనమని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు.మండపేట కలువపువ్వు సెంటర్ లో ఉన్న ప్రాచీన హనీఫీ అహలే సున్నత్ వల్ జామియా మస్జిద్ లో వైసిపి మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి రాజోలు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు కర్రి పాపారాయుడు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ లతో కలిసి ముస్లిం ఇఫ్తార్ విందు లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా ల నేతృత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను సత్కరించారు. మస్జిద్ ఇమామ్ ముహమ్మద్ గులామ్ ముర్షిద్ రజ్వీ ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం లో ఉపవాసాలు కు ప్రాధాన్యత వివరించారు. ముస్లిం మైనార్టీ ల సంక్షేమానికి మాజీ సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. మైనార్టీ లకు అండగా వుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, టౌన్ వైసిపి అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు,కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్,వైసిపి నాయకులు యరమటి వెంకన్న బాబు, సాధనల శివ భగవాన్, తణుకు అశోక్, బిల్లకుర్తి అంజి, వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ గౌస్, వైసిపి మైనార్టీ నాయకులు షేక్ సర్కార్, అర్షద్, హెచ్ ఎం టి అల్తాఫ్, కస్మూర్, ఉమర్, బాబు సాహెబ్, షేక్ బాజీ, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యుదయం ప్రతి ఇంటి నుండి ప్రారంభమవ్వాలి

**రాయవరంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు – సమాజ నిర్మాణంలో మహిళలదే కీలక పాత్ర**
**మహిళల హక్కులు, రక్షణకు సమాజం ముందుకు రావాలి : ఎస్సై సురేష్ బాబు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సిఐటీయూ, ఐద్వా, యూటిఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయవరం ఎస్సై సురేష్ బాబు, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి సీతాదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి, జనసేన నాయకులు కోటేశ్వరరావు లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ, మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని, మహిళా అభ్యుదయం ప్రతి ఇంటి ముంగిట నుంచి ప్రారంభమవ్వాలని, తమ పిల్లలకు అతి గారాబం చేయకుండా భాధ్యత కలిగిన వారిగా పెంచాలని, విద్యా బుద్ధులు నేర్పించే ఉపాధ్యాయుల పైనే దాడి చేసే పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిగా హ, ఉపాధ్యాయురాలిగా వారిని సరైన మార్గంలో నడిపించడానికి, సమాజంలో మహిళలకు రక్షణ, స్వేచ్ఛ, సమానత్వం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అనంతరం యూ టి ఎఫ్ జిల్లా కార్యదర్శి సీతాదేవి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలకు మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కుమారి, సత్యవేణి, దుర్గా, బేబీ, వెంకటలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ కుమారి, వెంకటలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాజమహేంద్రవరం నగరంలో జనసేన పార్టీ రాజమండ్రి కార్పొరేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. నగరమంతా జనసేన జెండాలు రెపరెపలాడుతుండగా వందలాది మంది యువతతో కూడిన భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం విశేషం. నగర వీధులన్నీ జనసైనికుల నినాదాలతో మారుమోగుతూ పండుగ వాతావరణాన్ని తలపించాయి. శనివారం ఉదయం కంబాల చెరువు సెంటర్‌లోని మదర్ తెరిస్సా పార్క్ వద్ద ప్రారంభమైన ఈ భారీ బైక్ ర్యాలీ దేవి చౌక్, ఆజాద్ చౌక్, టిటిడి కళ్యాణ మండపం, బైబిల్ ప్లేస్, ాూ అప్పారావు రోడ్, జె.ఎన్. రోడ్ మీదుగా దానవాయిపేట వరకు కొనసాగింది. వందలాది బైకులు, జనసేన జెండాలతో యువత ఉత్సాహంగా పాల్గొనడంతో నగర ప్రజల్లో విశేష ఆకర్షణ కలిగింది. అనంతరం దానవాయిపేటలోని రాజు న్యూరో హాస్పిటల్ సమీపంలో వై.శ్రీనివాస్ తన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యాలయ ఆవరణలో జనసేన పార్టీ జెండాను వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీర మహిళలు మరియు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. జనసేన పార్టీ కోసం కృషి చేస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జనసైనికుల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి వారి సేవలను స్మరించుకున్నారు. అదేవిధంగా నగర పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలను పంపిణీ చేసి వారికి కృతజ్ఞతాభివందనలు తెలిపారు. క్రియాశీలకంగా పనిచేస్తున్న జనసాధకులను సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వై. శ్రీనివాస్ గారు జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి నాయకత్వాన్ని కొనియాడారు. ప్రజల కోసం రాజకీయాల్లోకి అడుగుపెట్టిన పవన్ కళ్యాణ్ గారు ఎన్నో అవమానాలు, విమర్శలు, ఆటంకాలు ఎదుర్కొన్నప్పటికీ తన ధ్యేయాన్ని విడిచిపెట్టకుండా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆయన రాజకీయ ప్రయాణం కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో కనీస సదుపాయాల అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ గారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. గ్రామాలకు రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు అందించేందుకు ఆయన చూపుతున్న నిబద్ధత నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు ప్రజల ఆత్మగౌరవం, పారదర్శకత, సేవ అనే విలువలపై నిర్మితమై ఉన్నాయని, అదే ఆత్మతో జనసైనికులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుండి రాజమహేంద్రవరం నగరంలో తనతోపాటు కలిసి పయనిస్తూ పవన్ కళ్యాణ్ ఆశయాల సాధన కోసం నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులు, జనసైనికులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేసి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జనసైనికుల కుటుంబాలకు జనసేన పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నూతన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు, ఎండోమెంట్ డైరెక్టర్లు, జన సైనికులు, వీర మహిళలు, జనసేన నాయకులు, జనసేన అభిమానులు పాల్గొన్నారు.

# రాయవరంలో రైస్ మిల్ వద్ద ప్రమాదం... లారీ క్లీనర్ మృతి

**పట్టా విప్పుతుండగా జారి కిందపడిన క్లీనర్ మృతి, డ్రైవర్‌పై కేసు నమోదు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ధాన్యం లోడుతో వచ్చిన లారీని అన్‌లోడ్ చేయడానికి లారీపై ఉన్న పట్టా విప్పుతున్న సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యం తో లారీ క్లీనర్ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన రాయవరంలో చోటుచేసుకుంది. రాయవరం ఎస్సై సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం లో గల చంద్రిక రైస్ మిల్ వద్ద మార్చి 12 వ తేదీన జరిగిన ప్రమాదంలో ధాన్యం లోడుతో వచ్చిన లారీని అన్‌లోడ్ చేయడానికి లారీపై ఉన్న పట్టా విప్పుతున్న సమయంలో క్లీనర్‌గా పనిచేస్తున్న గుంటూరు జిల్లా కు చెందిన చింతల నరేష్ కుమార్ (43) లారీ పై నుండి జారి కింద పడిపోయాడని, ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్)కు తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ నరేష్ కుమార్ మృతి చెందినట్లు శనివారం తెలిపారు. మృతుడు నరేష్ కుమార్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని లారీపై పని చేస్తున్న సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు. లారీ డ్రైవర్ సరైన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సురేష్ బాబు వివరించారు.

# ఆ సినిమా ఫ్లాప్ అవుతుందని ముందే తెలుసు..


## 'ఉస్తాద్' రిలీజ్ వేళ రాశీ ఖన్నా షాకింగ్ కామెంట్స్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది రాశీ ఖన్నా. ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న ఆమె ఇటీవల రిలీజైన ఓ తెలుగు సినిమాపై షాకింగ్ కామెంట్స్ చేసింది. ఆ సినిమా రిజల్ట్ ను తాను ముందే ఊహించానంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైంది రాశీ ఖన్నా. మొదటి సినిమాతోనే అందం, అభినయంగా తెలుగు ఆడియెన్స్ ను కట్టి పడేసింది. దీని తర్వాత జోరు, సుప్రీం, జై లవకుశ, తొలి ప్రేమ, వెంకీమామ, ప్రతిరోజు పండగే.. ఇలా చాలా సినిమాలు చేసిందీ అందాల తార. తెలుగుతో పాటు హిందీ, తమిళం సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. చివరగా తెలుగులో తెలుసు కదా అనే ట్రయాంగిల్ లవ్ స్టోరీలో యాక్ట్ చేసింది. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కథానాయికగా చేస్తోంది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తోంది రాశీ ఖన్నా. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలను షేర్ చేసుకుంటోంది. ఈ క్రమంలోనే తన చివరి సినిమా తెలుసు కదా సినిమా గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది రాశీ ఖ్నా. ' తెతెలుసు కదా షూటింగ్ జరుగుతున్నప్పుడే ఈ సినిమా ఫలితం ఎలా ఉండబోతుందో నాకు అర్థమైపోయింది. సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో నాకు నచ్చని పాయింట్స్ అన్నీ చెప్పాను. కొన్ని సీన్స్ చిత్రీకరించేటప్పుడు ఇదెందుకో నాకు కరెక్ట్ కాదనిపిస్తుందన్నాను. కానీ, నీరజ కోన (డైరెక్టర్) విజన్ మీద నమ్మకంతో అలాగే ముందుకు వెళ్లాం. క్లైమాక్స్ కూడా అందరూ ఒప్పుకునేలా ఉండాలి, ఇదేదో తేడా కొడుతోందని నాకు అనిపించింది. అందుకే ఆపరేషన్ సీన్ చేయనన్నాను. చివరకు తప్పలేదు. అయినా ఈ సినిమా ద్వారా అందరూ ఏదో ఒక గుణపాఠం నేర్చుకున్నారు. అలా నేను కూడా నా అభిప్రాయాన్ని మరింత గట్టిగా చెప్పాల్సింది అని తెలుసుకున్నాను. ఆ మూవీ షూట్ చేస్తున్నకొద్దీ స్క్రిప్ట్ చాలా మారిపోయింది. నా చేతుల్లో ఏం లేదు' అని రాశీ ఖన్నా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా తెలుసు కదా సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నటించాడు. శ్రీనిధి శెట్టి మరో హీరోయిన్ గా యాక్ట్ చేసింది.

### మెగా అభిమానులకు గుడ్ న్యూస్..

# రామ్ చరణ్ బర్త్ డేకు డబుల్ ట్రీట్..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా నడుస్తుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వస్తుంది. దీంతో ఈ మూవీని ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా అని వెయిట్ చేస్తున్నారు మేకర్స్. పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. మెగాస్టార్ నట వారసుడిగా తెరంగేట్రం చేసి తండ్రికి తగ్గ తనయుడు అని నిరూపించుకున్నాడు. అద్భుతమైన నటనతో సినీరంగంలో తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా ఆర్ఆర్ఆర్ సినిమాతో యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. చిరు తర్వాత చరణ్ సినిమాలకు ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. ప్రస్తుతం పెద్ది చిత్రంలో నటిస్తున్నారు చరణ్. డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది. అలాగే కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ కీలకపాత్రలో నటిస్తున్నారు. అలాగే ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ నుంచి విడుదలైన పాటలు యూట్యూబ్ లో దూసుకుపోతున్నాయి. ఇదిలా ఉంటే.. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చెర్రీ బర్త్ డే ఘనంగా జరుపుకోవడానికి మెగా అభిమానులు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా చరణ్ సినిమాల అప్డేట్స్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఈ మూవీకి సంబంధించిన అప్డేట్స్ వస్తాయా అనే ఆసక్తి అభిమానుల కళ్లల్లో కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం ఈ ఏడాది చరణ్ బర్త్ డే అభిమానులకు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారని టాక్. పెద్ది సినిమాకు సంబంధించి క్రేజీ అప్డేట్ రానుందని సమాచారం. చరణ్ బర్త్ డే రోజున పెద్ది టీజర్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఇదే నిజమైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. మరోవైపు పెద్ది సినిమా తర్వాత చరణ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్ చేయనున్నారు. రంగస్థలం వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత వీరిద్దరు కలిసి మరోసారి సినిమా చేయనుండడంతో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆర్సీ 17 అనే వర్కింగ్ టైటిల్ తో ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈసినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ సారి చరణ్ బర్త్ డేకు మెగా అభిమానులకు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# ఐపీఎల్ మొదలవ్వకముందే వికెట్ డౌన్.. ఢిల్లీ జట్టును వీడిన ఇంగ్లాండ్ దిగ్గజం

క్రీడా వాయిస్



ఐపీఎల్ 2026 సందడి మొదలవ్వకముందే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు గట్టి షాక్ తగిలింది. టోర్నీ ప్రారంభానికి కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఉండగా, ఆ జట్టు మెంటార్‌గా ఉన్న ఇంగ్లాండ్ మాజీ దిగ్గజ బ్యాటర్ కెవిన్ పీటర్సన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ సీజన్‌లో తాను ఢిల్లీ జట్టుకు మెంటార్‌గా వ్యవహరించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ వేదికగా ఎదిగి, గతంలో ఢిల్లీ జట్టుకే ప్రాతినిధ్యం వహించిన పీటర్సన్, జట్టును వీడటం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పీటర్సన్ తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా ఆయన హిందీలో పోస్ట్ చేయడం విశేషం. మెంటార్ బాధ్యతలకు కేటాయించాల్సిన సమయం ప్రస్తుతం తన వద్ద లేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే ఐపీఎల్ ప్రేమికులకు ఆయన ఒక తీపి కబురు కూడా చెప్పారు. మెంటార్‌గా జట్టు పక్కన ఉండకపోయినా, కామెంట్రీ బాక్స్‌లో కూర్చుని తన గొంతుతో అభిమానులను అలరిస్తానని పీటర్సన్ హామీ ఇచ్చారు. "ఈ సీజన్‌లో నేను ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్‌గా ఉండలేను. ఈ పనికి కావాల్సిన సమయాన్ని నేను కేటాయించలేకపోతున్నాను. ఆటగాళ్లందరికీ ఆల్ ది బెస్ట్. అయితే మిమ్మల్ని కామెంట్రీ బాక్స్‌లో కలుస్తాను. ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యుత్తమ లీగ్. మిమ్మల్ని త్వరలోనే చూడాలని ఉంది" అంటూ పీటర్సన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. గత సీజన్‌లో పీటర్సన్ మెంటార్‌గా ఉన్నప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ ప్రదర్శన పర్వాలేదనిపించింది. సీజన్ ప్రారంభంలో అదరగొట్టినా, చివర్లో తడబడటంతో కేవలం ఒక్క పాయింట్ తేడాతో ప్లేఆఫ్స్ అవకాశాన్ని కోల్పోయి ఐదో స్థానంలో నిలిచింది. ఐపీఎల్ ప్రారంభానికి కేవలం 14 రోజుల ముందు ఇలాంటి కీలక వ్యక్తి దూరం కావడం ఢిల్లీ క్యాపిటల్స్ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రిషబ్ పంత్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు ఈసారి ఎలాగైనా కప్పు కొట్టాలని పట్టుదలతో ఉంది. ఇప్పుడు పీటర్సన్ స్థానంలో కొత్త మెంటార్‌ను తీసుకుంటారా లేక ఉన్న కోచింగ్ స్టాఫ్‌తోనే ముందుకు వెళ్తారా అన్నది వేచి చూడాలి. ఏదేమైనా పీటర్సన్ మెరుపు విశ్లేషణలు కామెంట్రీ బాక్స్ నుంచే వినాల్సి రావడం ఢిల్లీ అభిమానులకు కాస్త నిరాశ కలిగించే విషయమే.

# రోహిత్, కోహ్లీలకు అదే లాస్ట్ ఛాన్స్.. గంభీర్ మాస్టర్ ప్లాన్ వర్కవుట్ అవుతుందా?

గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో భారత్ రెండు ఐసీసీ టైటిళ్లు గెలిచినా, 2027 వన్డే ప్రపంచకప్ అసలైన పరీక్ష అని సౌరవ్ గంగూలీ పేర్కొన్నారు. సౌతాఫ్రికా పరిస్థితుల్లో గంభీర్ వ్యూహాలు కీలకం కానున్నాయి. ప్రస్తుతం జట్టు ఉన్న ఫామ్‌ను చూస్తుంటే గంభీర్ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని గంగూలీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ ప్రస్తుతం స్వర్ణయుగాన్ని ఆస్వాదిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో టీమిండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025, టీ20 వరల్డ్ కప్ 2026 వంటి రెండు భారీ ఐసీసీ టైటిళ్లను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అతి తక్కువ కాలంలోనే రెండు ఐసీసీ ట్రోఫీలు సాధించిన తొలి భారతీయ కోచ్‌గా గంభీర్ రికార్డు పుటల్లోకి ఎక్కారు. అయితే, టీమిండియా మాజీ సారథి సౌరవ్ గంగూలీ మాత్రం గంభీర్ అసలు సిసలు పరీక్ష ఇంకా ముందుందని అభిప్రాయపడ్డారు. సౌరవ్ గంగూలీ తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వైట్ బాల్ క్రికెట్‌లో గంభీర్ వ్యూహాలకు 2027 వన్డే ప్రపంచకప్ అతి పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. ఈ టోర్నీ సౌతాఫ్రికా వేదికగా జరగనుండటమే దీనికి ప్రధాన కారణం. అక్కడి పిచ్‌లు, వాతావరణ పరిస్థితులు ఉపఖండపు జట్లకు అంత తేలికగా లొంగవు. పేస్, బౌన్స్‌కు అనుకూలించే ఆ పిచ్‌లపై టీమిండియాను ప్రపంచ విజేతగా నిలపడమే గంభీర్ నాయకత్వానికి అసలైన గీటురాయి అని గంగూలీ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం జట్టు ఉన్న ఫామ్‌ను చూస్తుంటే గంభీర్ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మనందరికీ గుర్తున్నట్లుగా.. 2023 వన్డే ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాలతో ఫైనల్ చేరినా, దురదృష్టవశాత్తూ ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. ఆ గాయం అభిమానుల గుండెల్లో ఇంకా పచ్చిగానే ఉంది. ఆ లోటును 2027లో భర్తీ చేయాలని భారత్ పట్టుదలతో ఉంది. అంతేకాకుండా, 2027 ప్రపంచకప్ భారత దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు చివరి మెగా టోర్నీ అయ్యే అవకాశం ఉంది. ఈ దిగ్గజాలకు ఘనమైన వీడ్కోలు పలకాలంటే ట్రోఫీ గెలవడం గంభీర్‌పై ఉన్న అదనపు ఒత్తిడి అని గంగూలీ విశ్లేషించారు. కేవలం వైట్ బాల్ క్రికెట్ మాత్రమే కాకుండా, టెస్ట్



క్రికెట్‌లోనూ గంభీర్ తన ముద్ర వేయాలని గంగూలీ సూచించారు. ముఖ్యంగా పిచ్‌ల గురించి ఎక్కువగా ఆలోచించకుండా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆడేలా జట్టును సిద్ధం చేయాలని కోరారు. పిచ్ స్వభావాన్ని మెదడులో నుంచి తీసేసి, సహజసిద్ధమైన ఆట తీరుపై దృష్టి పెడితే టెస్టుల్లోనూ భారత్ అగ్రస్థానంలో ఉంటుందని సూచించారు. గంభీర్ ఒక అద్భుతమైన కోచ్ అని, ఆయనకు తగినంత సమయం ఇస్తే మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారని గంగూలీ పూర్తి మద్దతు ప్రకటించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com